

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (గురువారం సాయంత్రం)	సహరీ (శుక్రవారం ఉదయం)
కడప	6.31	4.58
ప్రొద్దుటూరు	6.32	5.02

జడ్పీ చైర్మన్ ఎన్నిక నేడే

- సందిగ్ధతకు తెర
- ఉదయం 10 గంటల నుంచి ప్రారంభం
- హైదరాబాద్ నుంచి కడపకు చేరిన జడ్పీటీసీలు



జడ్పీలో తన అనుచరులతో వైసీపీ చైర్మన్ అభ్యర్థి రామగోవిందరెడ్డి

కడప రూరల్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): జడ్పీ చైర్మన్ ఎన్నిక సందిగ్ధతకు తెరపడింది. ఒంటిమిట్ట, పులివెందుల జడ్పీటీసీ ఎన్నికలను జరిపిన తరువాత చైర్మన్ ఎన్నిక కొనసాగించాలని వేరువేరుగా మూడు పిటిషన్లు హైకోర్టులో దాఖలు అయ్యాయి. అయితే బుధవారం రాత్రి వరకు హైకోర్టు నుంచి జిల్లా ఎన్నికల అధికారికి ఎలాంటి డైరెక్షన్ రాకపోవడంతో రాష్ట్ర ఎన్నికల కమిషన్ జారీచేసిన నోటిఫికేషన్ ప్రకారం గురువారం జడ్పీ చైర్మన్ ఎన్నిక యధాప్రకారం జరగనుంది. జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ఏర్పాట్లు చేపట్టామని జడ్పీ సీఈవో ఓబులమ్మ తెలిపారు.

ఉదయం 10 గంటల నుంచి జడ్పీ సమావేశ మందిరంలో ఎన్నిక ప్రక్రియ ప్రారంభం కానుంది. మొదటగా జడ్పీటీసీలకు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించనున్నారు. తరువాత 12 గంటల వరకు అభ్యర్థుల నుంచి నామినేషన్ల స్వీకరణ, నామినేషన్ల పరిశీలన ఉంటుంది. 12 గంటలకు చెల్లుబాటయ్యే నామినేట్ అభ్యర్థుల జాబితాను ప్రచురణ చేయనున్నారు. మధ్యాహ్నం ఒంటి గంటకు అభ్యర్థుల ఉపసంహరణ ఉంటుంది. తరువాత జిల్లా ఎన్నికల అధికారి ఆధ్వర్యంలో పార్టీల వారీగా జడ్పీటీసీలకు క్యాబిన్ ఏర్పాటుచేసి చేతులెత్తి అభ్యర్థిని ఎన్నుకుంటారు. ఎన్నిక పూర్తయిన వెంటనే ఫలితాలను వెల్లడించనున్నారు.

క్యాంప్ నుంచి కడపకు జడ్పీటీసీ సభ్యులు..

జడ్పీచైర్మన్ ఎన్నిక నిర్వహణకు అడ్డంకులు లేవని తెలిపోవడంతో వైసీపీ చైర్మన్ అభ్యర్థి బి.మఠం జడ్పీటీసీ సభ్యుడు రామగోవిందరెడ్డి నేతృత్వంలో వైసీపీ నాయకులు సాయంత్రం 5 గంటల సమయానికి జడ్పీకి చేరుకున్నారు. హైదరాబాద్‌కు 30 కిలోమీటర్ల దూరంలోని డ్రీమ్ వ్యాలీలో ప్రత్యేక శిబిరంలో ఉన్న వైసీపీ జడ్పీటీసీ సభ్యులు బుధవారం రాత్రికి కడపకు చేరుకుని నగరంలోని ఓ కల్యాణమండంలో ఏర్పాటుచేసిన శిబిరంలో ఉండిపోయారు. అక్కడి నుంచి గురువారం ఉదయం 10 గంటలకు జడ్పీకి చేరుకుని చైర్మన్ ఎన్నికలో పాల్గొననున్నారు.

కాగా.. వైసీపీ జడ్పీటీసీలకు తమ పార్టీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథరెడ్డి విప్ జారీ చేస్తారని ఆ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫోన్ ద్వారా జిల్లా ఎన్నికల అధికారికి తెలియపరిచారు. ఈ మేరకు వైసీపీ జిల్లా అధ్యక్షుడు వారి జడ్పీటీసీలకు విప్ జారీచేసి జడ్పీటీసీల నుంచి సంతకాలు తీసుకున్నారు. బి.మఠం జడ్పీటీసీ సభ్యుడు రామగోవిందరెడ్డిని చైర్మన్ అభ్యర్థిగా పార్టీ నిర్ణయించిందని అతనిని గురువారం జరగనున్న ఎన్నికలో ఎన్నుకోవాలని సూచించారు. పార్టీ ఆదేశాలను ధిక్కరిస్తే క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

రూ.10వేల కోట్ల వృద్ధే లక్ష్యం



సదస్సులో పాల్గొన్న కలెక్టర్ చెరుకూరి శ్రీధర్

- ప్రతి దానిలో 15 శాతం గ్రోత్ రేటు
- వ్యవసాయం, పరిశ్రమలే కీలకం
- జిల్లా ప్రణాళికను సీఎంకు వివరించిన కలెక్టర్

(కడప-ఆంధ్రజ్యోతి): కడప జిల్లా వ్యవసాయాధారిత ప్రాంతం. అలాగే పరిశ్రమల ఏర్పాటుకు అనువైన భూములు, ఇతర వసతులు ఉన్నాయి. దీంతో ప్రతియేటా 15శాతం వృద్ధిరేటు లక్ష్యంగా విజన్ రూపొందించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో అంటే 2025-26 లో రూ.10వేల కోట్ల గ్రోత్ లక్ష్యంగా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ అధ్యక్షతన జిల్లా యంత్రాంగం ప్రణాళికలు రూపొందించింది. ప్రతి శాఖలోనూ వృద్ధి రేటు కనబరిచి లక్ష్యాన్ని ఎలా చేరుకోవాలో ఏడాది ప్రణాళిక రూపొందించారు. వ్యవసాయం, హార్టికల్చర్, పరిశ్రమలు ఇలా వివిధ రంగాల్లో ఏటా 15శాతం వృద్ధి రేటును నిర్ణయించారు. సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన కలెక్టర్ల సదస్సులో జిల్లా ప్రణాళికను కలెక్టర్ వివరించారు.

రూ.పదివేల కోట్లు లక్ష్యంగా..

జిల్లాలో అన్ని సెక్టార్ల ద్వారా ఏటా రూ.55,173 కోట్ల ఆదాయం వస్తుంది. అయితే 2025-26 సంవత్సరంలో దీన్ని రూ.67,216 కోట్లకు పెంచాలని నిర్ణయం తీసుకున్నారు. గ్రోత్ రేటు పెరిగేందుకు ఎలా ముందుకు వెళ్లాలో ప్రణాళిక రూపొందించారు. అగ్రికల్చర్‌లో వచ్చే ఆదాయం రూ.2,537 కోట్లుగా ఉంది. దీన్ని వచ్చే ఆర్థిక సంవత్సరానికి రూ.2,998 కోట్లకు తీసుకెళ్లాలని నిర్ణయించారు. అంటే సాగు విస్తీర్ణం పెంచడం, నూతన వంగడాల సృష్టితో లక్ష్యాన్ని చేరుకుంటామన్నారు.

- ప్రధానంగా వేరుశెనగ, శెనగ, కందులు, మినుములు, వరిలో గ్రోత్‌ను పెంచాలని ప్రణాళిక సిద్ధం చేశారు. వరిలో బీపీటీ 5204, కేడీయం 163, ఆర్ఎన్ఆర్ 1548 రకాలతో ఉత్పత్తి పెంచడం ద్వారా వృద్ధిరేటు సాధించేలా ప్రణాళికలు రూపొందించారు. ఇక వేరుశనగకు సంబంధించి టీసీ 48, 169, 4 దిగుబడి ఉత్పత్తి పెంచాలని నిర్ణయించారు. కందులు కొత్త వంగడాలు ఎల్ఆర్‌జీ 51 ద్వారా 5వేల హెక్టార్లలో సాగు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. మినుములను 7,500 హెక్టార్లలో నూతన వంగడాల ద్వారా సాగు చేసి అధిక దిగుబడి సాధించాలని లక్ష్యం పెట్టారు. నంద్యాల వెరైటీస్‌తో లక్ష హెక్టార్లలో శెనగను సాగు చేసి ఇక్కడ దిగుబడి పెంచుతారు.
- హార్టికల్చర్‌కు సంబంధించి అరటి, నిమ్మ, స్వీట్ ఆరంజి, పసుపులో అధిక దిగుబడి కోసం ఉత్పత్తి పెంచేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ప్రస్తుతం హార్టికల్చర్ ద్వారా రూ.11,228 కోట్లు ఆదాయం కాగా, దానిని వచ్చే సంవత్సరంలో రూ.13,344 కోట్లు 15 శాతం వృద్ధితో గ్రోత్ పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. 250 హెక్టార్లలో పాలి కల్టివేషన్ చేయాలని నిర్ణయించారు.
- జిల్లాకు మరో ప్రధాన ఆదాయ వనరు పరిశ్రమలు. సిమెంటు కర్మాగారాలు, సెంచరీ ప్లైవుడ్‌తో పాటు వివిధ పరిశ్రమలు జిల్లాలో ఉన్నాయి. వీటి ద్వారా ఆదాయం ప్రస్తుతం రూ.2,836 కోట్లు వస్తోంది. వచ్చే ఆర్థిక సంవత్సరంలో రూ.3,323 కోట్లు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో భాగంగా ఉన్న పరిశ్రమలను మరింత విస్తరణ చేపట్టనున్నారు. సెంచరీ ప్లైవుడ్, డిక్సన్, దాల్మియా మరికొన్ని పరిశ్రమలు విస్తరణ చేపట్టనుండడంతో ఇక్కడ మాన్యుఫ్యాక్చరింగ్ పెరగనుంది. వీటితో పాటు మరికొన్ని పరిశ్రమల ద్వారా వృద్ధి రేటు పెంచుకోనున్నారు.
- జీఎన్ఎస్ఎస్, వామికొండ రిజర్వాయర్, సర్వరాయసాగర్‌ను పూర్తి చేసి 35వేల ఎకరాల ఆయకట్టుకు నీరందించేందుకు 796 ఎకరాల భూమి అవసరం. భూసేకరణ కోసం రూ.85 కోట్లు ఖర్చవుతుంది. మొత్తం రూ.130కోట్లు అవసరం.
- గండికోటకు సంబంధించి పరిహారం చెల్లించాలి. మొత్తం ఆర్అండ్ఆర్ రూ.336.90 కోట్లు అవసరం. ఇందులో పెండింగు ఫండ్ బిల్లుల కోసం రూ.162.41 కోట్లు, ఆర్అండ్ఆర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్‌కు రూ.14.4 కోట్లు అవసరం. ఇతర పనులు పూర్తి చేయడానికి రూ.330 కోట్లు అవసరం.
- పులివెందుల మున్సిపాలిటీలో రూ.265 కోట్లతో చేపట్టిన నీటి పథకం 78శాతం పూర్తయింది. మిగతా పనులు పూర్తి చేయడానికి నిధులు కావాల్సి ఉంది.
- సీఎం చంద్రబాబు మైదుకూరు పర్యటన సందర్భంగా డ్రైనేజీ, రోడ్లు, లైట్లు, ఇతర వాటి కోసం రూ.211.65 కోట్లతో ఇచ్చిన హామీ మేరకు డీపీఆర్ తయారు చేశారు.
- 2006-07లో కడప-బెంగళూరు రహదారిని కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు జాయింట్ వెంచర్‌గా ప్రారంభించాయి. ఇప్పుడు భూసేకరణ పనులు నిలిచిపోయాయి. దాన్ని పూర్తి చేసేందుకు రాష్ట్రం నిధులు విడుదల చేయాలి.
- వాణిజ్యం, హోటల్స్, రెస్టారెంట్లు, పర్యాటకం ద్వారా రూ.408 కోట్లు ఆదాయం సమకూర్చుకునేలా ప్రణాళిక తయారు చేశారు. గండికోటలో ఓబెరాయ్ హోటల్, కడప విమానాశ్రయంలో కొత్త టెర్మినల్ నిర్మాణంతో దేశంలోని అన్ని మెట్రో నగరాలకు కనెక్టివిటీ, ఇక రైల్వేకు సంబంధించి వందేభారత్ సహా రైల్వేస్, టెలికాం, బ్యాంకింగ్, బీమా రంగంలో 15శాతం వృద్ధి రేటు సాధించేలా లక్ష్యాలు పెట్టుకున్నారు. ఈమేరకు సదస్సులో కలెక్టర్ వివరించారు.

కడపలో అపారమైన అవకాశాలున్నాయి : సీఎం

కడప జిల్లా అభివృద్ధికి సంబంధించి కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ సదస్సులో వివరించడంతో.. సీఎం చంద్రబాబు స్పందిస్తూ కడపలో పరిశ్రమల ఏర్పాటుకు అపారమైన అవకాశాలున్నాయన్నారు. కడప ఎయిర్‌పోర్టుతో పాటు ఓర్వకల్లు ఎయిర్‌పోర్టు, జాతీయ రహదారులు అమరావతి - పులివెందుల - బెంగళూరు రహదారి ఇలా జాతీయ రహదారులున్నాయన్నారు. బెస్ట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఉందని, సీమ జిల్లాల్లో తలసరి ఆదాయం రూ.2,93,637తో కడప మూడో స్థానంలో ఉందన్నారు. గ్రోత్ రేటులో 10.35కు గాను 1.6 మైనస్‌లో ఉందని దీనిని అధిగమించాలని సీఎం చంద్రబాబు సూచించారు.

శాంతియుత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలి

- జిల్లా శాంతి కమిటీ సమావేశంలో జాయింట్ కలెక్టర్ అదితి సింగ్



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ అదితి సింగ్

కడప కలెక్టరేట్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): మత సంప్రదాయాలను గౌరవిస్తూ, శాంతియుత వాతావరణంలో భక్తిభావంతో రంజాన్, ఉగాది, శ్రీరామనవమి పండుగలు జరుపుకోవాలని జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్లో శాంతి కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరనాయుడు, కడప కార్పొరేషన్ కమిషనర్ మనోజ్ రెడ్డి, కడప, పులివెందుల ఆర్డీవోలు జాన్ ఇర్విన్, చిన్నయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఒకరి మతాచారాలను మరొకరు గౌరవించుకుంటూ భక్తి శ్రద్ధలతో పండుగలు నిర్వహించుకోవాలన్నారు. ఇందుకు శాంతి కమిటీ సభ్యుల సహకారం ఉండాలన్నారు. అలాగే అన్ని శాఖల అధికారులు పండుగల ఏర్పాట్లు, ఉత్సవాలు సజావుగా జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. మత సామరస్యానికి ప్రతీకగా అన్ని మతాల ప్రజల సహకారంతో మజీద్‌లు, ఈద్గాలు, దేవాలయాల వద్ద ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ప్రార్థనలు, పూజలు జరిగేలా చూడాలన్నారు. ఎక్కడైనా ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. అనవసరమైన విషయాలను సోషల్ మీడియాల్లో పోస్టులు చేయకుండా శాంతి కమిటీ చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం శాంతి కమిటీ సభ్యుల సలహాలను, అభిప్రాయాలను జేసీ స్వీకరించారు.

స్వలాభం కోసమే ప్రశ్నపత్రం లీక్

- కారకులైన 9మంది అరెస్టు
- వివరాలు వెల్లడించిన కడప డీఎస్పీ

కడప క్రైం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): పదవ తరగతి గణితం ప్రశ్నపత్రాన్ని స్వలాభం కోసమే లీక్ చేశారని, ఈ కేసుకు సంబంధించి 9మందిని బుధవారం అరెస్టు చేశామని కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. కడప డీఎస్పీ కార్యాలయంలో బుధవారం కమలాపురం సీఐ రోషన్, ఎస్సై ప్రతాప్ రెడ్డితో కలిసి వివరాలను డీఎస్పీ వెల్లడించారు. ఈనెల 24వ తేదీన వల్లూరు జడ్పీ హైస్కూల్‌లోని పరీక్ష కేంద్రంలో పరీక్ష జరిగే సమయంలో పదవతరగతి గణితం ప్రశ్నపత్రాన్ని వాట్సాప్ ద్వారా లీక్ చేశారన్నారు. స్వలాభం కోసం చేసిన ఈ వ్యవహారంలో పలువురిపై కేసు చేశామన్నారు. కమలాపురానికి చెందిన ప్రైవేట్ స్కూల్ యాజమాన్యం తమ స్కూల్ విద్యార్థులకు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని, అలా అయితే స్కూల్‌లో విద్యార్థుల సంఖ్య పెరుగుతుందని ఈ చర్యకు పాల్పడ్డారన్నారు. టీచర్లు, చీఫ్, ఇన్విజిలేటర్లకు ఆశ పెట్టి క్వశ్చన్ పేపర్‌ను సెల్‌ఫోన్ ద్వారా ఫొటో తీసి దానికి జవాబులు పంపించి విద్యార్థులకు అందజేసే ప్రయత్నం చేశారన్నారు. దీనికి సంబంధించి సాయి మహేశ్, కమలాపురంలోని ప్రైవేట్ స్కూల్ టీచర్ విఘ్నేశ్వర్ రెడ్డి అలియాస్ విఘ్నేశ్, స్కూల్ కరస్పాండెంట్ రామసుబ్బారెడ్డి, ఎగ్జామ్ చీఫ్ సూపరిడెంటెంట్ రామకృష్ణమూర్తితోపాటు శ్రీకాంత్‌రెడ్డి, శ్రావణి, మధుయాదవ్, శ్రీనివాసులరెడ్డి, రమణలను అరెస్టు చేసి వారి వద్దనుంచి ప్రశ్నపత్రం, 4 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్ కు తరలించామన్నారు.

'ఉపాధ్యాయులను వేధించడం తగదు'

కడప ఎడ్యుకేషన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): వాటర్ బాయ్ చేసిన తప్పునకు పదవ తరగతి పరీక్ష విధులు నిర్వహిస్తున్న చీఫ్, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్, ఇన్విజిలేటర్‌ను విధుల నుంచి సస్పెండ్ చేయడమే కాకుండా వారి తలకు ముసుగులు వేసి మీడియా ముందు ప్రవేశపెట్టడాన్ని ఖండిస్తున్నట్లు ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి తెలిపారు. ప్రైవేట్ వ్యక్తులు చేసే కుట్రపూరిత తప్పులకు ఉపాధ్యాయులను బాధ్యులు చేయడం సమర్థనీయం కాదని పేర్కొన్నారు. ఈ మేరకు ఏపీసీపీఎస్ఈఏ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి ఎస్సార్ వెంకటజనార్ధన్‌రెడ్డితో కలసి ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

మెళకువలు పాటించాలి : ఆర్ఎం



శిక్షణ పూర్తి చేసుకున్న 24వ బ్యాచ్ డ్రైవర్లతో ఆర్టీసీ ఆర్ఎం గోపాల్‌రెడ్డి

కడప మారుతీనగర్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): రోడ్డుపై వాహనం నడిపే సమయంలో మెళకువలు పాటించాలని ఆర్టీసీ కడప రీజనల్ మేనేజర్ పి.గోపాల్‌రెడ్డి అన్నారు. ఏపీఎస్ ఆర్టీసీ హెవీ డ్రైవింగ్ స్కూల్‌లో శిక్షణ పూర్తిచేసుకున్న 24వ బ్యాచ్ డ్రైవర్లకు బుధవారం ఆర్ఎం చేతులమీదుగా సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న మెళకువలపై పూర్తి అవగాహన పెంచుకుని రోడ్డుపై వాహనం నడిపే సమయంలో పాటించి తద్వారా ప్రయాణికులను సురక్షితంగా వారి గమ్యస్థానాలకు చేర్చాలని సూచించారు. కార్యక్రమంలో కడప డిపో మేనేజర్ దిల్లేశ్వరరావు, ట్రైనర్ ఎస్ఎ జబ్బార్ పాల్గొన్నారు.

కడప ఆయుష్ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ సస్పెన్షన్ ఎత్తివేత

కలికిరి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఏడాది కాలం పైబడి సస్పెన్షన్‌లో ఉన్న కడప ఆయుష్ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ కేవీ కుమార్‌బాబు సస్పెన్షన్‌ను ఎత్తివేస్తూ ప్రభుత్వం బుధవారం ఆదేశాలు జారీ చేసింది. ఆయుష్ విభాగంలో రీజినల్ డిప్యూటీ డైరెక్టరుగా పనిచేస్తున్న సమయంలో ఆ శాఖ కమిషనర్ ఆయా వైద్యుల ముఖ హాజరు (ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్- ఎఫ్ఆర్ఎస్)ను పరిశీలిస్తుండగా యాదృచ్ఛికంగా కడప రీజినల్ పరిధిలోని అనేక మంది వైద్యులు ఇతర ప్రాంతాల నుంచి హాజరు వేయడాన్ని గుర్తించారు. అయితే పాలనాపరంగా రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ హోదాలో ఈ విషయాన్ని గుర్తించడంలో కుమార్‌బాబు విఫలమయ్యారనేది ఆయనపై వచ్చిన ప్రధాన ఆరోపణ. ఆయుష్ కమిషనర్ దీనిపై విచారణ జరిపిన అనంతరం గత ఏడాది జనవరి 23న కుమార్‌బాబును సస్పెండ్ చేశారు. అనంతరం ఇటీవలి తన సస్పెన్షన్‌ను తొలగించాలని ఆయన చేసుకున్న విజ్ఞప్తిని పరిశీలించిన ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ మేరకు సస్పెన్షను ఎత్తివేస్తూ ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి డాక్టర్ మంజుల డి హోస్మణి బుధవారం ఆదేశాలు జారీ చేశారు.

ఆస్తిపన్ను వసూళ్లలో అలసత్వం



ప్రొద్దుటూరు మున్సిపల్ కార్యాలయం

- రూ.31.63 కోట్లలో రూ.16.85 కోట్లు వసూళ్లు
- నీటి పన్ను వసూళ్లు మరింత నత్తనడక
- సచివాలయ సిబ్బంది ఉన్నా పన్ను వసూళ్లలో నిర్లక్ష్యం
- 5 రోజులలో 50 శాతం పన్నులు వసూలయ్యేనా..?

ఆస్తి పన్ను వసూళ్లలో ప్రొద్దుటూరు మున్సిపాలిటీ అధికారులు, సిబ్బంది అంతులేని అలసత్వం కారణంగా కోట్ల రూపాయల పన్ను బకాయిలు పేరుకుపోయాయి. వందలాది మంది సచివాలయ సిబ్బంది ఉన్నా ఆస్తిపన్ను, నీటి పన్ను వసూళ్లు సకాలంలో కావడం లేదు. ఇందువల్ల మున్సిపాలిటీలో అభివృద్ధి పనులతో పాటు ఉద్యోగులకు, కార్మికులకు జీతాలు చెల్లించలేని పరిస్థితి ఏర్పడింది. ఇక 5 రోజుల్లో 2024-25 ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నా ఇప్పటి వరకు 50శాతం పన్నులు మాత్రమే వసూలు చేశారు.

ప్రొద్దుటూరు, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో ఆస్తిపన్ను వసూళ్లపై రెవెన్యూ అధికారులది హడావుడి తప్ప కఠిన చర్యలు తీసుకోరు. కేవలం కొన్ని మొండిబకాయి దుకాణాలను మాత్రమే సీజ్ చేశారు. తక్కిన ఆస్తిపన్ను బకాయిదారులపై సీరియస్‌గా చర్యలు తీసుకోకపోవడం వలన నేడు పన్ను వసూళ్లు మందకొడిగా సాగుతున్నాయి. రెడ్‌నోటీసులు ఇచ్చినా పన్ను దారులు స్పందించలేదు.

ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో ఇంటి పన్ను అసెస్‌మెంట్లు 34,367 ఉన్నాయి. వాటికి 2024-25 ఆర్థిక సంవత్సరం కరెంట్ డిమాండ్ రూ.21.03 కోట్లు ఉంది. అరియర్స్ రూ.10.60 కోట్ల బకాయి ఉంది. మొత్తం రూ.31.63 కోట్లకు గాను రూ.16.85 కోట్లు వసూలైంది. మున్సిపాలిటీలో 23,943 కొళాయి కనెక్షన్లు ఉన్నాయి. వాటికి 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కరెంట్ డిమాండ్ రూ.2,78,61,220 ఉంది. ఇందులో వసూలైంది రూ.1,62,06,000 మాత్రమే. అరియర్స్ నీటి పన్ను రూ.3,43,67,475 బకాయి ఉండగా అందులో కేవలం రూ.49.49 లక్షలు మాత్రమే వసూలైంది. మొత్తం రూ.6.22 కోట్లలో ఇంకా రూ.4.10 కోట్లు నీటి పన్ను బకాయిలు వసూలు కావాల్సి ఉంది.

సచివాలయ సిబ్బంది అలసత్వం

మున్సిపాలిటీలో 46 సచివాలయాలు ఉన్నాయి. ఇందులో 400 మందికి పైగా ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఇంతమంది సచివాలయ సిబ్బంది ఉన్నా ఇంటి పన్నులు, నీటి పన్నులు సకాలంలో వసూలు చేయకపోవడంతో బకాయిలు కోట్లలో పేరుకు పోయాయి. మున్సిపల్ అధికారులు చివరలో మేలుకుని సచివాలయ సిబ్బందిపై పర్యవేక్షణ కోసం కేవలం మార్చి నెలలో నోడల్ ఆఫీసర్లను పెట్టారు. కనీసం నాలుగు నెలలు ముందుగా నోడల్ అధికారులను సచివాలయాలకు వేసి పర్యవేక్షించి ఉంటే ఈ పరిస్థితి నెలకొనేది కాదని పలువురు భావిస్తున్నారు.

ప్రతినెల రూ.2.16 కోట్లు ఖర్చు

మున్సిపాలిటీలో ప్రతినెల రూ.2.16 కోట్ల ఖర్చులు ఉన్నాయి. ఇందులో ఔట్‌సోర్సింగ్ కార్మికులకు, ఉద్యోగులకు జీతాలు రూ.76లక్షలు, కొవిడ్ వర్కర్లకు రూ.10లక్షలు, సులభ్ కు రూ.5లక్షలు, కరెంట్ బిల్లులు రూ.60లక్షలు, అమృత్ స్కీం లోనుకు రూ.65లక్షలు వెరసి నెలకు రూ.2.16 కోట్లు అక్షరాల మున్సిపాలిటీకి ఖర్చులున్నాయి. ఈ లెక్కన ఏడాదికి రూ.25 కోట్లు ఖర్చు అవుతుంది.

6 రోజుల్లో 50 శాతం పన్నులు వసూలయ్యేనా


2024-25 ఆర్థిక సంవత్సరం ఈ నెల 31వ తేదీతో ముగుస్తుంది. ఇక కేవలం ఐదు రోజులు మాత్రమే ఉంది. అందులో ఉగాది, రంజాన్ పండుగలు ఉన్నాయి. ఆ రెండు రోజులు సెలవు కావడంతో ఉన్నది మూడు రోజులు మాత్రమే. ఈ మూడు రోజులలో మరో 35 శాతం పన్నులు వసూలు చేస్తేనే ఈ ఆర్థిక సంవత్సరం గట్టెక్కుతారు. అరియర్స్ పన్ను మీద వడ్డీలో 50 శాతం రాయితీ ప్రకటిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు ఇచ్చింది. ఇది పన్నుదారులకు కొంత ఊరట కలిగించే అంశం. దీంతోనైనా పన్ను దారులు అరియర్స్ చెల్లింపులు చేస్తారా లేదా వేచి చూడాలి. అరియర్స్‌తో పాటు కరెంట్ డిమాండ్‌ను చెల్లించేలా అధికారులు గట్టిగా చర్యలు తీసుకోవాల్సి ఉంది.

పండుగ రోజుల్లోనూ పన్ను వసూళ్లు

సచివాలయానికి ఒకరిని నోడల్ అధికారిగా నియమించి పన్నులు రాబట్టడానికి అన్ని విధాలా ప్రయత్నం చేశాం. ఇప్పటికి 50 శాతం పన్ను వసూళ్లు దాటాం. 85 శాతం పన్నులు రాబట్టడానికి లక్ష్యంగా పెట్టుకున్నాం. ఈ నెలాఖరున ఉగాది, రంజాన్ పండుగ రోజులైనా ఉదయం నుంచి రాత్రి 9గంటల వరకు మున్సిపల్ కార్యాలయంలో పన్నులు కట్టించుకుంటాం. ప్రభుత్వం మంగళవారం నుంచి వడ్డీ మీద 50 శాతం రాయితీ ఇచ్చింది. గతంలో వడ్డీతో సహా చెల్లించిన వారికి కూడా ఈ రాయితీ కూడా వర్తిస్తుంది.

- మల్లికార్జున, మున్సిపల్ కమిషనర్, ప్రొద్దుటూరు

నీరు వృథా



పైపులైన్ లీకై వృథాగా పోతున్న నీరు

ఎండలు మండుతున్నాయి. పలుప్రాంతాల్లో తాగునీటికోసం జనం అల్లాడుతున్నారు. ఇలాంటి సమయంలో పైపులైన్ లీకై గంటల తరబడి నీరు వృథాగా పోవడం చూసి పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. బ్రహ్మంసాగర్ నుంచి సెంచరీ ప్లైవుడ్‌కు పైపులైన్ ద్వారా నీరు వెళుతుంది. బుధవారం పాలిటెక్నికల్ కళాశాల సమీపంలో సెంచరీ ప్లైవుడ్ కంపెనీకి సంబంధించి బ్రహ్మంసాగర్ పైపులైన్ లీకు కావడంతో నీరంతా దాదాపు 15 అడుగుల ఎత్తు వరకు ఎగసిపడుతూ జాతీయ రహదారిపై వృథాగా పోయింది. దీంతో వాహనదారులు, పాదచారులు చాలా ఇబ్బందులు పడ్డారు. సమస్య తెలుసుకున్న టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త రితేశ్‌కుమార్‌రెడ్డి సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి నీటి పైపులైన్ లీకేజీకి వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరారు. సాయంత్రం 4 గంటల సమయంలో మరమ్మతులు చేసి నీటి లీకేజీని అరికట్టారు.

- (బద్వేలు టౌన్-ఆంధ్రజ్యోతి)

నిర్లక్ష్యం నీడలో.. సౌమ్యనాథాలయం




- శిథిలమవుతున్న నిర్మాణాలు
- పునరుద్ధరణపై అధికారుల నిర్లక్ష్యం
- టీటీడీలో చేరినా అభివృద్ధి శూన్యం
- భక్తుల ఆశలు ఆవిరి

నందలూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రసిద్ధిగాంచిన చారిత్రాత్మక నందలూరు సౌమ్యనాథ స్వామి ఆలయ అభివృద్ధికి పురావస్తుశాఖ అడ్డుకట్టలా మారింది. ఈ ఆలయం చోళరాజుల నిర్మాణ శైలికి ప్రతీకగా నిలుస్తుంది. శతాబ్దాలుగా ఈ ఆలయం వైష్ణవుల పుణ్యక్షేత్రంగా వెలుగొందుతోంది. ఈ ఆలయంలోని మూలవిరాట్‌ను దైవర్షి నారదుడు ప్రతిష్ఠించినట్లుగా చెబుతారు. వాగ్గేయకారుడు అన్నమయ్య పూజలందుకున్న స్వామి కొలువైన ఆలయంగా 2022 డిసెంబరు 31న ఆలయ ఉత్తర ప్రహరీ గోడలోని కొంతభాగం కూలిపోయింది. దానిని పరిశీలించిన పురావస్తుశాఖ అధికారులు వీలైనంత త్వరగా గోడను నిర్మిస్తామని తెలిపారు. కానీ రెండేళ్లు గడిచిపోయినా ఇప్పటికీ పట్టించుకున్న పాపాన పోలేదని భక్తులు ఆవేదన చెందుతున్నారు. గతంలో ఆలయంలోని ఉద్యానవనాన్ని పర్యవేక్షించేందుకు పురావస్తుశాఖ అధికారులు కాంట్రాక్టు ప్రాతిపదికన ఒక వ్యక్తిని నియమించారు. కొంత కాలం తర్వారత గార్డెనర్‌ను తొలగించడంతో ఆలయ ఆవరణలోకి పశువులు ఇతర జంతువులు విచ్చలవిడిగా ప్రవేశించడమే కాక భక్తులపై దాడి చేసేందుకు ప్రయత్నిస్తున్నాయి. టీటీడీ వారు ఏర్పాటు చేసిన జల ప్రసాదం వద్ద తాగునీరు రాక భక్తులు దప్పికతో అలమటిస్తున్నారు. ఆలయం బయట ఏర్పాటు చేసిన మరుగుదొడ్లు నిర్వహణ లేకపోవడంతో ఆ ప్రాంతమంతా దుర్గంధం వ్యాపిస్తోంది. దీంతో మహిళలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆలయాన్ని టీటీడీ వారు తమ అధీనంలోకి తీసుకోవడంతో భక్తులకు ఎన్నో సౌకర్యాలు ఏర్పడుతాయని, అన్నదానం చేస్తారని భక్తులు విశ్వసించారు. అయితే, రెండేళ్లు గడుస్తున్నా వారి ఆశలు నెరవేరలేదు. వసతుల కల్పనలో అటు టీటీడీ, ఇటు పురావస్తుశాఖ రెండూ విఫలమయ్యాయని భక్తులు ఆరోపిస్తున్నారు. నేడు ఆలయానికి జిల్లా నుంచే కాక ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి భక్తులు వచ్చి స్వామివారిని దర్శించి వారి మొక్కులు తీర్చుకుంటున్నారు. కోరుకున్న కోర్కెలు తీరిన పలువురు భక్తులు 108 ప్రదక్షిణలు చేసి తమ భక్తిని చాటుకుంటున్నారు. భక్తులకు మెరుగైన వసతులు కల్పించాలని పలువురు సూచిస్తున్నారు.



ఆలయ ఆవరణలో యథేచ్ఛగా తిరుగుతున్న పశువులు



కూలిన ఆలయ ప్రహరీ గోడ



నిరుపయోగంగా మారిన టీటీడీ జలప్రసాద కేంద్రం

ఆలయ అభివృద్ధికి సహకరించాలి



రాయలసీమలోని పురాతన ఆలయాల్లో సౌమ్యనాథాలయం ఒకటి. దేవాలయ దక్షిణ దిశన కూలిన గోపురం, ఉత్తర దిశన కూలిన ప్రహరీగోడ పునర్నిర్మాణం వాస్తు రీత్యా చాలా ముఖ్యం. ఒంటిమిట్ట కోదండరామాలయం తరహాలో అభివృద్ధిపై టీటీడీ దృష్టి పెట్టాలి. అభివృద్ధికి పురావస్తుశాఖను ఒప్పించాలి.

- పసుపులేటి శంకర్, అధ్యక్షుడు పోతన సాహిత్య పీఠం

ప్రభుత్వం కృషి చేయాలి



సౌమ్యనాథ దేవాలయం రెండేళ్ల క్రితం టీటీడీ ఆధీనంలోకి వెళ్లినా అభివృద్ధికి నోచుకోలేదు. దేవాలయం తరపున అన్నదానం నిర్వహించడం లేదు. తూర్పు వైపు గోడ కూలిపోయి ఏళ్లు గడుస్తున్నా బాగుచేసే ఆలోచన కనిపించడం లేదు. ఈ దేవాలయం అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేయాలని కోరుకుంటున్నా.

- అరిగె రాంప్రసాద్, బీజేపీ కోకన్వీనర్, రాజంపేట

స్వాస్థ్య ఆస్పత్రిలో సీటీస్కాన్ ప్రారంభం



సీటీ స్కాన్ యంత్రాన్ని ప్రారంభిస్తున్న పద్మభూషణ్ ముంతాజ్‌అలి

మదనపల్లె టౌన్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): రోగులకు నామమాత్రపు ఫీజులతో మెరుగైన వైద్యసేవలందించేందుకు స్వాస్థ్య ఆస్పత్రిని నిర్వహిస్తున్నామని పద్మభూషణ్ ముంతాజ్‌అలి తెలిపారు. బుధవారం స్థానిక సత్సంగ్ ఆశ్రమం ఆవరణలోని స్వాస్థ్య ఆస్పత్రిలో సీటీ స్కానర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండేళ్ల క్రితం కేంద్రమంత్రి నితిన్‌గడ్కారి ప్రారంభించిన స్వాస్థ్య ఆస్పత్రిలో 15 వేల మంది అవుట్‌పేషెంట్లకు, 230 మంది ఇన్‌పేషెంట్లకు వైద్య సేవలందించామన్నారు. వీటితో పాటు అత్యాధునిక వాహనంలో గ్రామాల్లో ఆరోగ్య, వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. తక్కువ ఖర్చుతో రోగులకు చికిత్స అందించడంతో పాటు, సీటీ స్కానర్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. అనంతరం సీటీ స్కానర్ దాతలు కేంబ్రిడ్జికి చెందిన అజయ్‌భాటియా, అల్ట్రా సౌండ్ స్కానర్ దాత పూణెకు హెచ్‌ఎన్‌బీ ఇంజనీర్స్ ప్రైవేటు లిమిటెడ్ వారికి ఆస్పత్రి వర్గాలు కృతజ్ఞతలు తెలియజేశాయి. డైరెక్టర్ డాక్టర్ వెంకటరమణ, శోభ వెంకట్, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఎర్రకొండకు నిప్పు



కాలిపోతున్న పొదలు

నిమ్మనపల్లి, మార్చి 26(ఆంధ్ర జ్యోతి): మండలంలోని తవళం పంచాయతీ నల్లంవారిపల్లి సమీపంలోని ఎర్రకొండకు బుధవారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టారు. సమీప గ్రామస్తులు మంటలను ఆర్పేందుకు ప్రయత్నించినా సాధ్యం కాకపోవడంతో అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. తవళం గ్రామం మొత్తం అటవీ ప్రాంతం కావడంతో అడవి మొత్తం మంటలు వ్యాప్తిచెందే అవకాశం ఉంది. వేసవికారణం గా పశువులకు మేత దొరకని పరిస్థితుల్లో నిప్పు పెట్టడంపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పొలంలోని షెడ్‌కు నిప్పు





దగ్ధమవుతున్న షెడ్, కాలిపోయిన బైక్

రామసముద్రం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించడంతో పొలంలోని షెడ్ దగ్ధమైంది. మండల కేంద్రానికి చెందిన భరత్‌రెడ్డి పొలంలోని షెడ్‌కు బుధవారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. దీంతో వ్యవసాయ పనిముట్లు, స్ప్రేయర్, 200 మీటర్ల కేబుల్ వైర్, 10 కట్టల మల్చింగ్ పేపర్, 7 క్యాన్ల నీమ్ ఆయిల్‌తోపాటు, ఒక ద్విచక్ర వాహనం, టిల్లర్ అగ్నికి ఆహుతయ్యాయి. విషయం తెలుసుకున్న రైతు అగ్ని మాపక సిబ్బంది సమాచారం అందించారు. వారు వచ్చేలోపు అన్ని వస్తువులు కాలి బూడిదయ్యాయి. సీఐ సత్యనారాయణ, ఎస్‌ఐ రవికుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. రైతు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. కాగా, బాధిత రైతుకు, ఓ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తికి మధ్య భూమికి సంబంధిత తగాదా నేపథ్యంలో ఈ సంఘటన జరగడం ప్రాధాన్యత సంతరించుకుంది.

నాటుసారా విక్రేత అరెస్టు

మదనపల్లె టౌన్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం సీటీఎం హరిజనవాడ వద్ద నాటుసారా విక్రయిస్తున్న వై.హరీష్(27)ను అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ భీమలింగ తెలిపారు. బుధవారం ఎక్సైజ్ ఎస్‌ఐలు డోర్కాస్, జబీవుల్లా, సిబ్బంది సీటీఎం హరిజనవాడలో తనిఖీలు నిర్వహించి హరీష్‌ను అదుపులోకి తీసుకుని, 30 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. అతడికి నాటుసారా సరఫరా చేసిన వాల్మీకిపురం మండలం మేకలవారిపల్లెకు చెందిన ఎం.మల్లికార్జునపై కూడా కేసు నమోదు చేశామన్నారు. దాడుల్లో హెచ్‌సీ శ్రీనివాసులు, వీరనాగయ్య, పీసీలు నాగరాజు, మధు పాల్గొన్నారు.

ఇరువర్గాల ఘర్షణ.. ఐదుగురిపై కేసు నమోదు

మదనపల్లె అర్బన్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): స్థానిక నీరుగట్టువారిపల్లె, చౌడేశ్వరి సర్కిల్‌లో మంగళవారం రాత్రి ఇరువర్గాలు గొడవపడ్డాయి. మద్యం సేవించి రాడ్లు, కొడవళ్లతో దాడులు చేసుకున్నారు. ఈ ఘర్షణకు సంబంధించి శశి , శ్రీకాంత్, శివనాగ, రాజేష్, లోకేశ్‌పై కేసు నమోదు చేసినట్లు మదనపల్లె టూటౌన్ సీఐ రామచంద్ర తెలిపారు. కేసు విచారణలో ఉందన్నారు.

వీరభద్రుడి హుండీ ఆదాయం రూ.27.54 లక్షలు



హుండీలోని కానుకలు లెక్కిస్తున్న సిబ్బంది, అర్చకులు, అధికారులు

రాయచోటి టౌన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): హుండీలోని కానుకల ద్వారా వంద రోజులకు గాను వీరభద్రాలయానికి రూ.27.54 లక్షలు ఆదాయం వచ్చినట్లు జిల్లా దేవదాయ శాఖ అధికారి శివయ్య తెలిపారు. స్థానిక భద్రకాళీ సమేత వీరభద్రస్వామి దేవస్థానం హుండీల్లోని కానుకలను బుధవారం లెక్కించారు. వీరభద్రస్వామి హుండీ ద్వారా రూ. 19,51,890 , భద్రకాళి ఆలయ హుండీ ద్వారా రూ.3,76,325, విఘ్నేశ్వరాలయ హుండీ ద్వారా రూ.1,33,790, అఘోరలింగేశ్వరస్వామి హుండీ ద్వారా రూ. 1,05,560 , సుబ్రమణ్య స్వామి, కాలభైరవ స్వామి,నవగ్రహ మండపం హుండీల ద్వారా వచ్చిన రూ.49,170తో కలపి మొత్తం రూ.26,16,735లను రాయచోటి ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులో జమ చేశారు. అన్నదానం హుండీ ఆదాయం రూ. 1,39, 071ని స్టేట్ బ్యాంకులోని అన్నదానం అకౌంట్‌లో జమ చేసినట్లు ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి తెలియజేశారు. అలాగే 17.100 గ్రాముల బంగారం. 2.200 కేజీల వెండి భక్తులు సమర్పించారని తెలిపారు ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు సిబ్బంది, పోలీసు సిబ్బంది కుమారస్వామి, సురేశ్‌కుమార్, విద్యాసాగర్, ఆలయ సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

రెడ్డెమ్మ హుండీ ఆదాయం రూ.4.05 లక్షలు



గుర్రంకొండ: హుండీలోని కానుకలు లెక్కిస్తున్న అధికారులు

గుర్రంకొండ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): చెర్లోపల్లె రెడ్డెమ్మ అమ్మవారి హుండీని బుధవారం దేవదాయశాఖ అధికారి శశికుమార్ ఆధ్వర్యంలో లెక్కించారు. రెండు నెలలకు రూ.4,05,053 నగదు, 4 గ్రాముల బంగారం, 100 గ్రాముల వెండి వచ్చినట్లు తెలిపారు. ఈ మొత్తాన్ని అమ్మవారి ఆలయం అభివృద్ధికి వినియోగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఈఓ మంజుల, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

విశిష్ట సంఖ్య నమోదు రైతులకు తప్పనిసరి



పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్

రామాపురం, మార్చి26(ఆంధ్రజ్యోతి): రైతులు విశిష్ట సంఖ్య తప్పనిసరిగా చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్ సూచించారు. మండలంలోని బండపల్లి పంచాయతీ వెంకటరెడ్డిగారిపల్లెలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ రైతులు విశిష్ట సంఖ్య నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని తెలిపారు. ఈ విశిష్ట సంఖ్య ఉన్న రైతులు భవిష్యత్తులో, అనుబంధ శాఖల ద్వారా వచ్చే పథకాలకు అర్హులని తెలిపారు. పంటల బీమా పథకం, దాని వలన రైతులకు కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. సీఎం యాప్‌లో వివరాలు నమోదు చేయించుకున్న రైతుల నుంచి మాత్రమే ప్రభుత్వం క్వింటాలుకు రూ.7,550 కనీసం మద్దతు ధరతో కంది కొనుగోలు చేస్తుందన్నారు. రాయచోటి మార్కెట్ యార్డులో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసినట్లు రైతులకు తెలియజేశారు. ప్రకృతి వ్యవసాయం పై రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో లక్కిరెడ్డిపల్లె సహాయ వ్యవసాయ సంచాలకులు జయరాణి, మండల వ్యవసాయ అధికారిణి నాగమణి, రైతు సేవా సిబ్బంది మంజుల, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

డీఎస్సీ ఆన్‌లైన్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

- ఆలస్యంగా స్పందించిన బీసీ సంక్షేమశాఖ అధికారులు

రాయచోటిటౌన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీకి ఆన్‌లైన్‌లో ఉచిత శిక్షణ కోసం నిరుద్యోగ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని అన్నమయ్య జిల్లా వెనుకబడిన తరగుల సంక్షేమ సాధికారిత అధికారి సురేశ్‌బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్నమయ్య జిల్లాకు చెంది, ఏపీ టెట్‌లో అర్హత సాధించిన బీసీ, ఈడబ్ల్యూసీ, ఈబీసీ అభ్యర్థులు మాత్రమే దరఖాస్తుకు అర్హులన్నారు. ఈ నెల 10వ తేదీ నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆయన తెలిపారు.ఖాళీ దరఖాస్తు ఫారాలు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షే మ శాఖ కార్యాలయంలో లభిస్తాయన్నారు. అలాగే టెట్‌కు అర్హత కలిగిన అభ్యర్థులు తమ దరఖాస్తుకు టెట్‌లో పొందిన అర్హత పత్రంతో పాటు 2 ఫొటోలు, విద్యార్హతకు సంబంధించిన సర్టిఫికెట్లు, కులం, ఆదాయం, ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డ్, నేటివిటీ తదితర జిరాక్స్ కాపీలను దరఖాస్తుకు జతపరిచి, పూర్తి చేసిన దరఖాస్తును అన్నమయ్య జిల్లా వెనుకబడిన తరతగుల సంక్షేమశాఖ కార్యాలయంలో అభ్యర్థులే స్వయంగా అందజేయాలన్నారు.

ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మరింత సమాచారం కోసం 9912445108, 7989819470 నెంబర్లలో సంప్రదించాలన్నారు. ఈ నెల 10 నుంచి దరఖాస్తులను తీసుకుంటున్నప్పటికీ అధికారులు 16 రోజుల అనంతరం ప్రకటన ఇవ్వడంపై నిరుద్యోగ యువతీ, యువకులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈపై దాడి?!

మదనపల్లె, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణంలోని తంబళ్లపల్లె గ్రామీణ నీటి సరఫరా విభాగం డీఈ కార్యాలయంలో బుధవారం సాయంత్రం ములకలచెరువు ఏఈపై దాడి జరిగినట్లు తెలిసింది. కార్యాలయంలో పనిచేసే ఉద్యోగినిని ములకలచెరువు ఏఈ అసభ్యకరంగా దూషించడంతో ఆమె కుటుంబ సభ్యులు కార్యాలయానికి వచ్చి దాడి చేసినట్లు సమాచారం. ఈ విషయం పట్టణమంతా వ్యాపించడంతో మీడియా ప్రతినిధులు ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయానికి వెళ్లి విచారించగా అధికారులు అలాంటిదేమి జరగలేదని సమాధానం ఇచ్చారు. కొందరు మాత్రం చిన్న పాటి గొడవ రావడంతో సర్దేశామని, ఇంతటితో వదిలేయమని చెప్పారు. ఉన్నతాధికారులు మాత్రం ఈ విషయం బయటకు పొక్కకుండా లోలోపలే సర్దుబాటు చేసి పంపించినట్లు తెలుస్తోంది.

యోగాతో పంచేంద్రియాల అదుపు

- యోగా శిక్షకురాలు సుసాన్



విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న విదేశీ యోగా మాస్టర్లు

మదనపల్లె టౌన్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): యోగాతో పంచేంద్రియాలు అదుపులో పెట్టుకోవడమేకాక, మానసిక ప్రశాంతత, ఆరోగ్యం సిద్ధిస్తుందని అమెరికాకు చెందిన ట్రెడిషనల్ మెడిటేషన్ ప్రాజెక్టు యోగా శిక్షకురాలు మిస్ సుసాన్ వివరించారు. బుధవారం స్థానిక విజయభారతి హైస్కూల్లోని విద్యార్థులకు ఆమె యోగాపై అవగాహన కల్పించారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్.సేతు మాట్లాడుతూ ప్రపంచంలోని అన్ని దేశాలకు యోగాలో ఆది గురువు భారతదేశమే అన్నారు. చిన్నతనం నుంచి యోగా సాధన చేస్తే ఏకాగ్రత సాధించవచ్చన్నారు. అనంతరం రష్యా శిక్షకురాలు మిస్ సారా, అమెరికాకు చెందిన మిస్ లిండా యోగాపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ నిశ్చిత, ట్రెడిషనల్ మెడిటేషన్ ప్రాజెక్టు ఇన్‌చార్జి వి.కవిత, శివకుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

టమోటా ఆదాయం ఖర్చులకే సరి!

- గిట్టుబాటు కాక పొలంలోనే వదిలేసిన రైతులు




పొలంలోనే వదిలేసిన టమోటపంట

లక్కిరెడ్డిపల్లె, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మార్కెట్‌లో ధర పడిపోవడం, కోత కూలి, మార్కెట్‌కు తరలించేందుకు అయ్యే వ్యయం పెరిగిపోవడంతో ఈ ఏడాది టమోటా పంట నష్టాలనే మిగిల్చిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని కోనంపేట,పందిళ్లపల్లె, దప్పేపల్లె, మద్దిరేవుల, కాకుళవరం గ్రామాల్లో రైతులు పెద్ద ఎత్తున టమోటా సాగుచేశారు. ఆశించిన స్థాయి లో దిగుబడి కూడా వచ్చింది. అయితే, మార్కెట్‌లో ధర పడిపోయింది. కోతకు ఒక్కో కూలీకి రోజుకు రూ.500, ఒక్కో బుట్టకు రూ.200 చెల్లించి మార్కెట్‌కు తరలిస్తే 20 కిలోలు ఉన్న క్రేట్ 50 రూపాయలకు అడుగుతున్నారని రైతులు చెబుతున్నారు. వేల రూపాయల ఖర్చు పెట్టి పంట సాగుచేస్తే పెట్టుబడి కూడా రాలేదని టమోట రైతు మహబూబ్ బాషా ఆవేదన వ్యక్తం చేశారు.

కేంద్రీయ విద్యాలయం ప్రారంభానికి కసరత్తు!

- స్థలం స్వాధీనం ప్రక్రియ వేగవంతం
- ఈ విద్యా సంవత్సరం నుంచే అడ్మిషన్లు..
- తాత్కాలిక భవనాల్లో తరగతుల నిర్వహణ





కేంద్రీయ విద్యాలయానికి కేటాయించనున్న స్థలం, తరగతులు నిర్వహించనున్న తాత్కాలిక భవనాలు

మదనపల్లె టౌన్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): మదనపల్లె ప్రాంత ప్రజలు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న కేంద్రీయ విద్యాలయ సంఘటన్‌లో తరగతులు ప్రారంభించడానికి అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఏప్రిల్ చివర లేదా మే నెలలో నాలుగు తరగతులకు అడ్మిషన్లు జరిగే అవకాశం కనిపిస్తోంది. గత వైసీపీ ప్రభుత్వ నిర్వాకంతో స్థల సేకరణ, కేటాయింపు ప్రక్రియ ఆలస్యం కావడంతో అప్పట్లో అడ్మిషన్లు అటకెక్కాయి.

సాకారం కానున్న స్వప్నం

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో విద్యాహబ్‌గా భావిస్తున్న మదనపల్లెలో ఇప్పటికే కేంద్ర మానవ వనరుల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో జవహర్ నవోదయ విద్యాలయ నిర్వహిస్తున్నారు. గత డిసెంబర్‌లో దేశవ్యాప్తంగా 85 ప్రాంతాల్లో కేంద్రీయ విద్యాలయ సంఘటన్ ఏర్పాటుకు కేంద్ర మంత్రిమండలి ఆమోదం తెలిపింది. ఇందులో భాగంగా మదనపల్లెలో కేంద్రీయ విద్యాలయ ఏర్పాటుకు ఉత్తర్వులు వెలువడ్డాయి.

స్థల కేటాయింపులో నిర్లక్ష్యం

మదనపల్లెలో కేంద్రీయ విద్యాలయ ఏర్పాటుకు 6 ఎకరాల స్థలం కావాలని ఏడాదిన్నర క్రితం కేంద్రీయ విద్యాలయ సౌత్‌జోన్ అధికారులు కోరడంతో మదనపల్లె మండలం వలసపల్లె వద్ద రెవెన్యూ అధికారులు స్థలాన్ని గుర్తించినా, కేటాయింపులో అప్పటి ప్రభుత్వం ఆలస్యం చేసింది. మదనపల్లె పట్టణంలోని ఎస్టీ గురుకుల పాఠశాల పక్కన తాత్కాలిక భవనాలను ఏర్పాటు చేసి అందులోనే కేంద్రీయ విద్యాలయ నిర్వహించాలని సూచించారు. కాని సౌత్‌జోన్ కేంద్రీయ విద్యాలయ అధికారులు మాత్రం, పక్కాగా స్థలం కేటాయించిన తరువాతే అడ్మిషన్లు ప్రారంభిస్తామని తెగేసి చెప్పారు. దీంతో 2024-25 విద్యా సంవత్సరంలో మదనపల్లె కేంద్రీయ విద్యాలయలో అడ్మిషన్లు నిలిచిపోయాయి.

అడ్మిషన్లకు మార్గం సుగమం..

కేంద్రీయ విద్యాలయాల్లో ఒకటో తరగతి ప్రవేశాలకు ఈ నెల 7 నుంచి 21 వరకు దరఖాస్తులు స్వీకరించారు. ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 7.5 శాతం, ఓబీసీలకు 27 శాతం, దివ్యాంగులకు 3 శాతం ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించనున్నారు. అయితే, స్థలం స్వాధీనంలో జరుగుతున్న ఆలస్యం అడ్మిషన్లపై ప్రభావం చూపుతోంది. దీంతో మదనపల్లె సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ చొరవ తీసుకుని వలసపల్లె పంచాయతీ పరిధిలో సర్వే నెంబర్లు 713/3,4 , 496/2,3 లెటర్లలో 6.09 ఎకరాల స్థలాన్ని స్వాధీనం చేసేందుకు స్కెచ్‌లు, స్థల వివరాలతో ఫైలు సిద్ధం చేసి కలెక్టర్‌కు పంపారు. ఆ స్థలంలో ముళ్లపొదలను తొలగించి, చదును చేసే పనులు ముమ్మరం చేశారు. పట్టణంలోని ఎస్టీ గురుకుల పాఠశాల పక్కన తాత్కాలిక భవనాల్లో కేంద్రీయ విద్యాలయ తరగతుల నిర్వహణకు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేయిస్తున్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులకు వేర్వేరుగా మరుగుదొడ్లు, ఏర్పాటు చేస్తున్నారు. తాగునీటి కోసం బోరును డీపెనింగ్ చేయిస్తున్నారు. ఈ నెలాఖరులోగా కేంద్రీయ విద్యాలయ స్థలం స్వాధీనం ప్రక్రియ పూర్తి అయ్యే అవకాశాలు ఉన్నాయి. ఇదే జరిగితే ఏప్రిల్ నెలాఖరులోగా మదనపల్లె కేంద్రీయ విద్యాలయలో విద్యార్థుల అడ్మిషన్లకు నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉందని తెలుస్తోంది.


5 నుంచి 8 వరకు తరగతులు?



మదనపల్లె కేంద్రీయ విద్యాలయలో 2025-26 విద్యాసంవత్సరానికి గాను 5వ తరగతి నుంచి 8వ తరగతి వరకు విద్యార్థులను చేర్చుకునే అవకాశం వుంది. ఇప్పటికే మిగిలిన చోట్ల ఏప్రిల్ ఒకటి నుంచి అడ్మిషన్లు ప్రారంభయ్యే సూచనలున్నా యి. వలసపల్లె వద్ద కేంద్రీయ విద్యాలయకు 6.09 ఎకరాల స్థల స్వాధీనం ప్రక్రియ తుదిదశకు వచ్చింది. ఈ విషయాన్ని సౌత్‌జోన్ కేంద్రీయ విద్యాలయ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ మంజునాథ్ దృష్టికి తీసుకెళ్లాం. స్థలం స్వా ధీనం అవుతూనే మదనపల్లెలోని తాత్కాలిక భవనాల్లో 5 నుంచి 8 తరగతుల వరకు కేంద్రీయ విద్యాలయలో అడ్మిషన్లు ప్రారం భం అవుతాయి. అంతా సవ్యంగా జరిగితే మదనపల్లె ప్రాంత విద్యార్థులకు ఈ ఏడాదే కేంద్రీయ విద్యాలయం అందుబాటులోకి వస్తుంది.

- సబ్ కలెక్టర్ మేఘస్వరూప్

ద్విచక్రవాహనాలు ఢీ... టీడీపీ కార్యకర్త మృతి


రాజారెడ్డి మృతదేహం

కలసపాడు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శంఖవరం-లింగారెడ్డిపల్లె మధ్యలో రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ఘటనలో లింగారెడ్డిపల్లెకు చెందిన కొత్తపల్లె రాజారెడ్డి (42) అనే టీడీపీ కార్యకర్త మృతి చెందాడు. రాజారెడ్డి మంగళవారం రాత్రి పోరుమామిళ్లలో తన సొంత పనిముగించుకొని తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా.. మరో ద్విచక్రవాహనం ఢీకొంది. దీంతో గాయపడ్డ రాజారెడ్డిని పోరుమామిళ్ల ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్స కోసం కడపకు తరలించగా.. చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మరణించినట్లు మృతుడి బంధువులు తెలిపారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య



కలసపాడు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండపేటలో బుధవారం జోసఫ్ (48) అనే వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గిద్దలూరు ప్రాంతానికి చెందిన ఇతను కొండపేటలో వివాహం చేసుకుని ఇక్కడే ఉంటూ గొర్రెలు కాసుకొని జీవనం సాగించేవాడు. బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గొర్రెల పెంపకం లావాదేవీల్లో అప్పులు కావడంతో మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్థులు తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

చోరీకి యత్నించిన దొంగ అరెస్టు



ఎర్రగుంట్ల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): బంగారు గొలుసు చోరీకి యత్నించిన యువకుడిని పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. ఎర్రగుంట్ల అర్బన్ సీఐ నరేష్ బాబు వివరాలకు మేరకు... చిలమకూరులో నివాసం ఉంటున్న సంగటి ప్రణయ్‌కుమార్ చెడు వ్యసనాలకు బానిసగా మారి దొంగతనాలకు పాల్పడేవాడు. ఇళ్లలో ఒంటరిగా ఉన్న మహిళలతో మాటమాట కలిపి వారి మెడలో ఉన్న బంగారు నగలను చేసేవాడు. ఈనేపథ్యంలో 24వ తేదీ మధ్యాహ్నం ఎర్రగుంట్ల మహేశ్వరనగర్‌లో చిల్లర అంగడి నడుపుతున్న లక్ష్మీదేవి మెడలోని బంగారు చైన్‌ను లాక్కొనే ప్రయత్నం చేశాడు. ఆమె వెంటనే కేకలు వేయడంతో పారిపోయాడు. ఈమేరకు నిందితుడి కోసం గాలింపు చేపట్టి బుధవారం ఎర్రగుంట్లలో అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ మృతి


ధనలక్ష్మి(ఫైల్ ఫొటో)

ముద్దనూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా తాడిపత్రి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన ముద్దనూరు వాసి ధనలక్ష్మి(32) బుధవారం తెల్లవారుజామున మృతి చెందింది. కుటుంబ సభ్యుల సమాచారం మేరకు వివరాలు... ముద్దనూరు కు చెందిన రాజకుళాయప్ప, ధనలక్ష్మి దంపతులు కొంతకాలంగా తాడిపత్రిలో నివాసం ఉంటున్నారు. ధనలక్ష్మి తాడిపత్రి నగరపాలక కార్యాలయంలో నాన్‌స్వీపర్ వర్కర్‌గా పనిచేస్తుంది. వీరి కుమారుడు అకిల్ తాడిపత్రి సమీపంలోని రావివెంకటాంపల్లి వద్ద నున్న ఓ ప్రైవేటు పాఠశాలలో చదువుతున్నాడు. మంగళవారం సాయంత్రం కుమారుడి వద్దకు ద్విచక్రవాహనంలో వెళ్లారు. తిరిగి వస్తుండగా తాడిపత్రి సమీపంలో ఎదురుగా ఆటో వచ్చి బైకును ఢీకొంది. ఈ ప్రమాదంలో భార్య, భర్తకు తీవ్రగాయాలయ్యాయి. ధనలక్ష్మి పరిస్థితి విషమంగా ఉండటంతో బెంగళూరుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ తెల్లవారు జామున మృతి చెందింది. మృతదేహాన్ని ముద్దనూరుకు తీసుకువచ్చి అంత్యక్రియలు చేశారు.

గోతిలో పడి గోవు మృతి

వేంపల్లె, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె పట్టణంలోని సాయిబాబా ఆలయం సమీపంలో ప్రమాదవశాత్తు గోతిలో పడి గోవు మృతిచెందింది. కాల్వల కోసం ఇష్టానుసారంగా గోతులు తవ్వి తర్వాత పూడ్చకపోవడంతో గోవులు గోతుల్లో పడుతున్నాయి. మృతిచెందిన గోవుకు బీజేపీ నాయకులు, మానవత సంస్థ ప్రతినిధులు అంతిమసంస్కారాలు నిర్వహించారు.

ప్రొద్దుటూరు డూప్ యార్న్ సిల్క్ తయారీకి భౌగోళిక గుర్తింపు?

- హైదరాబాద్ బీ2బీ రెజల్యూషన్ సంస్థ పరిశీలన

ప్రొద్దుటూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): చేనేత జౌళి శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ప్రొద్దుటూరులో డూప్‌యార్న్ సిల్క్ మాధవరం కాటన్ చీరల తయారీకి భౌగోళిక గుర్తింపు ఎంపిక ప్రక్రియకు సంబంధించి హైదరాబాదు బీ2బీ రెజల్యూషన్ సంస్థ నిపుణుల బృందం బుధవారం ప్రొద్దుటూరుకు వచ్చింది. స్థానిక వసంతపేట వీధిలోని చెన్నకేశవ సిల్క్ చేనేత సహకార సంఘాన్ని సందర్శించి డూప్‌యార్న్ సిల్క్ తయారీ విధానాన్ని, ప్రత్యేకతను గురించి తెలుసుకున్నారు. డూప్‌యార్న్ రీలింగ్ యూనిట్ డైయింగ్ యూనిట్ చేనేత మగ్గాలను సందర్శించి డూప్ యార్న్ సిల్క్ తయారీని ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ భౌగోళిక గుర్తింపు ప్రొద్దుటూరు డూప్ యార్న్ సిల్క్‌కి వస్తే ప్రొద్దుటూరుకు ప్రపంచస్థాయి గుర్తింపు వచ్చి ఇక్కడ చేనేత కార్మికులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. ఈ పరిశీలన బృందంలో జిల్లా చేనేత జౌళి శాఖ అధికారులు అహ్మద్ మెహిద్దీన్, హైదరాబాద్ బీ2బీ సంస్థ ప్రతినిధులు సీవీ శేషగిరిరావు, ఎస్.రవిప్రకాష్ రెడ్డి వున్నారు. చెన్నకేశవ సిల్క్ చేనేత సహకార సంఘం అధ్యక్షుడు కడప రామిశెట్టి, హరి ప్రకాష్‌లు పాల్గొన్నారు.

రసవత్తరంగా.. గోపవరం ఉప సర్పంచు ఎన్నిక

- 14 మంది వార్డు మెంబర్లతో వైసీపీ క్యాంప్ రాజకీయం
- టీడీపీ పావులు కదుపుతుందా.. లేదా?
- నేడే ఎన్నిక.... పటిష్ట పోలీసు బందోబస్తు



గోపవరం పంచాయతీ కార్యాలయం

ప్రొద్దుటూరు రూరల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మండలం గోపవరం పంచాయతీ ఉప సర్పంచ్ ఎన్నిక రసవత్తరంగా మారింది. పంచాయతీలో మొత్తం 20 మంది వార్డు సభ్యులు ఉన్నారు. అప్పట్లో గోపవరం పంచాయతీ ఉపసర్పంచ్ పదవిని రెండున్నర సంవత్సరాలు ఓసీలకు, రెండున్నర సంవత్సరాలు బీసీలకు ఇస్తామని అప్పటి ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఈ మేరకు ఉపసర్పంచ్ బీరం రాఘవరెడ్డి తన కాలపరిమితి ముగిసిన తర్వాత పదవికి రాజీనామ చేశారు. అయితే ఉప ఎన్నిక నోటిఫికేషన్ వెలువడడంలో ఆలస్యమైంది. ఈ తరుణంలో బీసీ వార్డు మెంబరు మండల రమాదేవిని అనధికారికంగా ఉపసర్పంచ్‌గా నిలబెట్టారు. అయితే మారిన రాజకీయ నేపథ్యంలో ఉప సర్పంచ్ ఎన్నికకు నోటిఫికేషన్ వెలువడింది. దీంతో ఈనెల 27న ఉపసర్పంచ్‌ను ఎన్నుకోనున్నారు. కాగా, వైసీపీలోని కొందరు వార్డు మెంబర్లు టీడీపీకి మద్దతుగా నిలిచారు. దీంతో మిగిలిన కాలపరిమితిలో కూడా తానే ఉపసర్పంచ్‌గా కొనసాగాలని మునపటి ఉపసర్పంచ్ బీరం రాఘవరెడ్డి ఆశపడ్డారు. ఈ మేరకు వైసీపీ నాయకుల అండతో గత ఆదివారం సుమారు 14 మంది వార్డు మెంబర్లతో క్యాంపు రాజకీయానికి తెరలేపారు. ఎన్నడు లేని విధంగా ఉపసర్పంచ్ ఎన్నికలో కూడా వార్డు మెంబర్లతో క్యాంపు రాజకీయం నడపడంతో నియోజకవర్గంలో పెద్ద ఎత్తున చర్చనీయాంశంగా మారింది. వీరందరిని హైదరాబాదులోని ఓ స్థావరంలో ఉంచి వారికి కావాల్సినవన్నీ సమకూర్చుతూ ఎన్నిక సమయానికి నేరుగా ఎన్నిక జరిగే పంచాయతీ కార్యాలయానికి తీసుకురానున్నారు. వార్డు మెంబర్ల సెల్ ఫోన్లు కూడా పనిచేయలేదు. వీరిలో ఎవరు కూడా మాట తప్పకుండా ఉండేందుకు వార్డు మెంబర్లకు ఆశించిన మేరకు వైసీపీ నుంచి తాయిలాలు కూడా అందినట్లు చర్చ జరుగుతోంది. అయితే బీసీ ప్రాతినిధ్యం కలిగిన ఈ పంచాయతీలో అప్పటి ఎమ్మెల్యే రాచమల్లు ఇచ్చిన మాట మేరకు రెండవ విడతగా ఉపసర్పంచ్ అభ్యర్థిగా బీసీ వార్డు మెంబర్‌ను నిలబెడుతారని చెప్పి ప్రస్తుతం మోసం చేయడం ఎంతవరకు సబబు అని పంచాయతీలోని బీసీ నాయకులు వాపోతున్నారు. 14 మంది వార్డు మెంబర్లతో ఉపసర్పంచ్ అభ్యర్థి క్యాంపు రాజకీయాలు నడపడంతో గెలుపునకు అవకాశాలు వైసీపీకే ఉన్నాయని మండలంలో విశ్లేషకులు బేరీజు వేస్తున్నారు. వైసీపీ నేత మాజీ ఎమ్మెల్యే బీసీలకు ఇచ్చిన మాట తప్పారని ఆరుగురు వార్డు సభ్యులు బుధవారం ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి సమక్షంలో తెలుగుదేశం తీర్థం పుచ్చుకున్నారు. పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని తమకు జరిగిన అన్యాయం నేపథ్యంలో వైసీపీని వీడి కూటమి ప్రభుత్వంలోకి చేరుతున్నామన్నారు. అయితే క్యాంపులో ఉన్నవారిలో కొంతమంది బీసీ అభ్యర్థిని ఎన్నుకునేందుకు మొగ్గు చూపుతారని ఆశాభావం కొందరిలో ఉంది. గురువారం జరిగే ఉప ఎన్నికల్లో ఉద్రిక్తత నెలకొనే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ఈ ఎన్నికల్లో ఎటువంటి గొడవలకు తావు లేకుండా డీఎస్పీ భావన ఆధ్వర్యంలో గట్టి బందోబస్తును ఏర్పాటు చేస్తున్నారు. వార్డు మెంబర్ల చేత చేతిని పైకి ఎత్తే విధానంలో ఉప సర్పంచ్ ఎన్నిక సాగనుంది. ఈ పదవి వైసీపీ ఖాతాలోకి వెళుతుందా, లేదా ఎమ్మెల్యే ప్రమేయంతో బీసీ అభ్యర్థిని ఉపసర్పంచ్‌గా ఎన్నుకునేందుకు పావులు కదుపుతారా అనేది వేచి చూడాల్సి ఉంది.

శంకుస్థాపనలకే పరిమితమైన కడప ఉక్కు పరిశ్రమ

- విద్యార్థులు, యువత భాగస్వామ్యంతోనే సాధ్యం
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కె.ప్రభాకర్‌రెడ్డి



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి

ప్రొద్దుటూరు టౌన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): కేంద్రం, రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీల నిర్లిప్తతో రాష్ట్ర విభజన హామీలో ఇచ్చిన కడప ఉక్కు పరిశ్రమ ముగ్గురు ముఖ్యమంత్రులు, నాలుగు శంకుస్థాపనలకు పరిమితమైందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కె.ప్రభాకర్‌రెడ్డి విమర్శించారు. బుధవారం ఎన్జీవో హోంలో సీపీఎం ఆధ్వర్యంలో కడప ఉక్కు, ఆంధ్రుల హక్కు జిల్లా సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విభజన సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధికి ఇచ్చిన హామీలలో కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటు ప్రధానమైందన్నారు. గత 11 సంవత్సరాలుగా అధికార, ప్రతిపక్ష పార్టీల స్థానాలు మారుతున్నా ఉక్కు పరిశ్రమ సాకారం కావడంలేదన్నారు. ఉక్కు పరిశ్రమ వలన రాయలసీమ ప్రాంతంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్ష ఉద్యోగాలు వస్తాయని ఈ ప్రాంత రూపురేఖలే మారిపోతాయన్నారు. రాజకీయ పార్టీల స్వార్థానికి ఉక్కు పరిశ్రమ బలి అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉక్కు పరిశ్రమపై మొదటి నుంచి సీపీఎం పోరాటం చేస్తోందన్నారు. యువత, విద్యార్థులకు భాగస్వామ్యం కల్పించినప్పుడే ఉక్కు పరిశ్రమ సాకారం అవుతుందన్నారు. ఇక రాజధాని పేరుతో చంద్రబాబు ఊహా ప్రపంచంలో విహరిస్తే జగన్ చంద్రబాబుపై కోపంతో రాష్ట్రానికి రాజధాని లేకుండా చేశారన్నారు. రాష్ట్రాభివృద్ధి, రాజధాని నిర్మాణం, పోలవరం ప్రాజెక్టుపై మోడీ ప్రభుత్వం రాష్ట్రంతో దోబూచులాడుతోందని విమర్శించారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి పి.చంద్రశేఖర్, జిల్లా సభ్యులు మనోహర్, అన్వేష్, బయన్న, గఫూర్, షరీఫ్, డాక్టర్ నరసింహారెడ్డి, డాక్టర్ తవ్వా సురేష్, ముంతాజ్ బేగం తదితరులు పాల్గొన్నారు.

3న వైవీయూలో రిక్రూట్‌మెంట్ డ్రైవ్


పోస్టర్‌ను విడుదల చేస్తున్న ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డి, రిజిస్ట్రార్ పద్మ

కడప ఎడ్యుకేషన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఏప్రిల్ 3వ తేదీ క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు విశ్వవిద్యాలయ కళాశాల ప్రధాన ఆచార్యులు ప్రొఫెసర్ రఘునాథరెడ్డి తెలిపారు. విద్యాలయ కులసచివులు, ప్లేస్‌మెంట్ సెల్ ప్రతినిధులతో కలిసి ఉద్యోగ డ్రైవ్‌కి సంబంధించిన పోస్టర్‌ను వీసీ చాంబర్‌లో విడుదల చేశారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఉద్యోగాల ఎంపికలకు ప్రముఖ మల్టీనేషనల్ బయోఫార్మస్యూటికల్ కంపెనీ బయోకాన్ విద్యాలయానికి రానుందని తెలిపారు. బయోకాన్ కంపెనీలోని ప్రొడక్షన్ విభాగంలో చేరేందుకు బీఎస్సీ కెమిస్ట్రీ, ఎమ్మెస్సీ కెమిస్ట్రీ, డిప్లమో కెమికల్, బీటెక్ కెమికల్ అర్హతలు కలిగి ఉండాలన్నారు. క్వాలిటీ కంట్రోల్ విభాగంలో ఉద్యోగాల కోసం ఎమ్మెస్సీ కెమిస్ట్రీ, బయోటెక్నాలజీ, మైక్రోబయాలజీ అర్హతలు ఉండాలన్నారు. ఇంజనీరింగ్ అండ్ మెయింటెనెన్స్ విభాగాలలో ఉద్యోగాల కోసం మెకానికల్, ఈఈఈ, ఈసీ, ఇన్‌స్ట్రుమెంటేషన్‌లో బీఈ, బీటెక్, డిప్లమో అర్హతలు ఉన్నవారు అర్హులన్నారు. 2023, 2024, 2025 బ్యాచ్‌లలో చదివిన, ప్రస్తుత చదువుతున్న విద్యార్థులు మాత్రమే డ్రైవ్‌లో పాల్గొనేందుకు అర్హులని తెలిపారు. విద్యార్థులు బయోడేటాతో విశ్వవిద్యాలయంలోని ఏపీజే అబ్దుల్ కలాం గ్రంథాలయ ప్రాంగణంలో జరిగే ఇంటర్వ్యూలకు నేరుగా హాజరు కావాలన్నారు. ఎంపికైన వారు హైదరాబాద్, వైజాగ్ నగరాలలో జాబ్ చేయాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో కులసచివులు ఆచార్య పద్మ, ఆచార్య చంద్రశేఖర్, ప్లేస్‌మెంట్ సెల్ డైరెక్టర్ ఆచార్య విజయభారతి, డాక్టర్ బి.రెడ్డయ్య, డాక్టర్ ప్రశాంతి మాదక్క, అసిస్టెంట్ రిజిస్ట్రార్ సరళ పాల్గొన్నారు.

టీడీపీలో వర్గపోరు

- గ్రావెల్ రోడ్డు విషయమై ఇరువర్గాల మధ్య ఘర్షణ
- పోలీసుల రంగప్రవేశం
- సర్దుమణిగిన వివాదం



గొందిపల్లె గ్రావెల్ రోడ్డు ఇదే.., ఘర్షణను నివారిస్తున్న పోలీసులు

వేముల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలో వర్గపోరు కారణంగా టీడీపీ శ్రేణులు రచ్చకెక్కాయి. ఓ గ్రావెల్ రోడ్డు విషయమై ఇరువర్గాల మధ్య ఘర్షణ చెలరేగింది. వివరాలిలా.. గొందిపల్లె గ్రామంలోని పులివెందుల-కడప ప్రధాన రహదారి నుంచి పొలాలకు వెళ్లే మట్టిరోడ్డు కోసం గత ప్రభుత్వంలో రూ.20లక్షల నిధులు మంజూరయ్యాయి. పనులు చేసిన కాంట్రాక్టర్ ఇంకా 20శాతం బిల్లులు రావాలని వివరించాడు. గొందిపల్లె గ్రామంలోని ఎమ్మెల్సీ వర్గీయుడు టీడీపీ నాయ కుడు బొజ్జ మైసూరారెడ్డి గత ప్రభుత్వంలో పూర్తైన మట్టి రోడ్డును మళ్లీ రోడ్డు వేయడానికి రూ.5లక్షల నిధులతో అప్రూవల్ తెచ్చుకున్నాడు. బుధవారం రోడ్డు వేయడానికి టిప్పర్లు, హిటాచి మిషన్ తీసుకెళ్తుండగా అదే గ్రామానికి చెందిన టీడీపీ మండల యువత అధ్యక్షుడు ఆసం విశ్వేశ్వ ర్‌రెడ్డి అతని అనుచరవర్గం రోడ్డు పనులు జరగకుండా అడ్డుకున్నారు.

ఈ విషయమై వేముల పోలీస్‌స్టేషన్‌లో ఆర్కేవ్యాలీ సీఐ ఉలసయ్య మాట్లాడుతూ టీడీపీ ఎమ్మెల్సీ వర్గీయుడు శాంక్షన్ ఆర్డర్ వచ్చిన చోట యదావిధిగా రోడ్డు వేసుకోవచ్చని వివరిం చారు. పంచా యతీరాజ్ ఏఈ అబ్దుల్లాను వివరణ కోరగా.. 2024 డిసెంబరులో జడ్పీ నిధుల కింద రోడ్డు వేసుకోవడానికి అనుమతులు వచ్చాయని, వచ్చిన చోట మాత్రమే మట్టి రోడ్డును వేసుకోవడానికి అనుమతులు వచ్చాయని.. అక్కడ మాత్రమే రోడ్డు పూర్తిచేసుకోవాలని తెలిపారు. కాగా ఇరువర్గాలు గుంపులు ఏర్పడ్డ సమాచారాన్ని తెలుసు కున్న డీఎస్పీ మురళీనాయక్, సీఐ ఉలసయ్య, ఎస్ఐ ప్రవీణ్‌కుమార్, పోలీస్ సిబ్బంది కార్యకర్తలను చెదరగొట్టి ఘర్షణను సర్దుమణిచారు.

కడప మార్కెటింగ్ ఈఈగా జయశేఖర్ నియామకం

- కాకినాడలో మహిళా ఉద్యోగిపై లైంగిక వేధింపుల ఆరోపణలు
- 2022లో ఉద్యోగం నుంచి తొలగిస్తూ ఆదేశాలు
- తొలగింపు చర్యను నిలుపుదల చేస్తూ ప్రస్తుతం కడపకు పోస్టింగ్

కలికిరి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): కడప వ్యవసాయ మార్కెటింగ్ ఎక్జిక్యూటివ్ ఇంజినీరుగా కె.జయశేఖర్‌ను నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. కాకినాడలో పనిచేసే కాలంలో 2014లో ఆయన అదే శాఖలో పనిచేస్తున్న ఒక మహిళా ఉద్యోగినిపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారనే తీవ్రమైన ఆరోపణలు ఎదుర్కొన్నారు. వివిధ రకాల విచారణ కమిషన్లు, వివిధ కోర్టులు జయశేఖర్ కేసును విచారించాయి. అన్ని స్థాయిల్లోనూ ఆరోపణలు రుజువు కావడంతో 2022 అక్టోబరు 10న జయశేఖర్‌ను ఉద్యోగం నుంచి తొలగిస్తూ అప్పటి వైసీపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకుని ఆమేరకు ఆదేశాలు జారీ చేసింది. తాజాగా జయశేఖర్ ప్రభుత్వానికి చేసుకున్న వినతులను పరిశీలించిన ప్రభుత్వం ఉద్యోగం నుంచి ఆయనను తొలగించిన ఉత్తర్వులను రద్దు చేసింది. ఆపైన కడప వ్యవసాయ మార్కెటింగ్ ఈఈగా నియమిస్తూ వ్యవసాయ, సహకార శాఖ ఎక్స్ అఫిషియో ప్రత్యేక ముఖ్య కార్యదర్శి బి.రాజశేఖర్ బుధవారం ఆదేశాలు జారీ చేశారు.

పాస్టర్ ప్రవీణ్ మృతిపై న్యాయ విచారణ చేయాలి



కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరుటౌన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): పాస్టర్ ప్రవీణ్ పగిడాల మృతిపై రాష్ట్ర ప్రభుత్వం న్యాయ విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించాలని రాష్ట్ర మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు రామాజి ఇమ్మానుయేల్ డిమాండ్ చేశారు. బుధవారం సాయంత్రం ఆయన మృతికి నిరసనగా పాత బస్టాండులోని అంబేద్కర్ విగ్రహం వద్ద పాస్టర్స్ అసోసియేషన్ సభ్యులు, రాష్ట్ర మాలమహానాడు ఆధ్వర్యంలో కొవ్వొత్తులు వెలిగించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాస్టర్ ప్రవీణ్ పగిడాల మృతిపై అనేక అనుమానాలు ఉన్నాయని.. కొందరు హత్యగా పేర్కొంటే మరికొందరు మృతి చెందాడని ప్రచారం చేస్తున్నారన్నారు. మత ప్రచారం చేసుకునే వ్యక్తి మృతిపై అనుమానాలు రావడం దారుణమని.. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి న్యాయ విచారణ జరిపి హత్య జరిగి ఉంటే నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర మాల మహానాడు రాష్ట్ర గౌరవాధ్యక్షుడు మురళీప్రసాద్, ఓబులేసు, కిరణ్‌కుమార్, లక్షుమయ్య, అరుణ్‌కుమార్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యపై ఆత్మహత్యాయత్నం.. ఆర్డీవో విచారణ


బాధితుడు గుడిమె సుధాకర్‌తో మాట్లాడుతున్న ఆర్డీవో చంద్రమోహన్

బ్రహ్మంగారిమఠం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముడుమాల గ్రామానికి చెందిన గుడిమె సుధాకర్ ఇటీవల తన భూసమస్యలు పరిష్కరించాలంటూ కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న పోలీసులు అదుపులోకి తీసుకుని రెవెన్యూ అధికారులకు అప్పగించారు. ఈ విషయంపై బద్వేలు డివిజను ఆర్డీవో బుధవారం బ్రహ్మంగారిమఠం తహసీల్దారు కార్యాలయంలో విచారణ చేశారు. బాధితుడి సుధాకర్‌తో మాట్లాడి.. భూసమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వెంటనే భూమికి కొలతలు వేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తహసీల్దారుకు ఆదేశాలు జారీ చేశారు. కాగా, మండలంలో ప్రభుత్వ భూములను ఎవరైనా ఆక్రమిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఆర్డీవో హెచ్చరించారు.

రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీ ఫెలోగా డాక్టర్ బుసిరెడ్డి సుధాకర్‌రెడ్డి ఎంపిక



కడప ఎడ్యుకేషన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): కడప ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి) భౌతిక శాస్త్ర విభాగంలోని మెటీరియల్ ఫిజిక్స్ ప్రొఫెసర్ బుసిరెడ్డి సుధాకర్‌రెడ్డి రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీ ఫెలోగా ఎంపికయ్యారని ప్రిన్సిపల్ డాక్టర్ రవీంద్రనాథ్ తెలిపారు. రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీ అనేది యునైటెడ్ కింగ్ డమ్‌లో ఉన్న ఒక ప్రొఫెషనల్ సొసైటీ, ప్రపంచవ్యాప్తంగా 50వేల మందికి పైగా సభ్యులు ఉన్నారు. ఫెలో ఆఫ్ ది రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీ హోదా రసాయన శాస్త్రాలకు (మెటీ రియల్ కెమిస్ట్రీ మరియు ఫిజిక్స్‌తో సహా) గణనీయమైన కృషి చేసిన వారికి ఇస్తారు. ఫెలోలను ఇతర సభ్యులు నామినేట్ చేస్తారని ప్రిన్సిపల్ చెప్పారు. డాక్టర్ సుధాకర్‌రెడ్డి పరిశోధన ఇంటర్ డిసిప్లినరీ, భౌతిక, రసా యన, పదార్థ శాస్త్రాలను మిళితం చేస్తుంది. శక్తిమార్పిడి మరియు నిల్వ, డబ్ల్యూఎల్ఈడీలు, లేజర్‌లు ఫోటోనిక్స్ రంగాలతో పాటు డాక్టర్ రెడ్డి బృందం ప్రస్తుతం క్వాంటం కంప్యూటింగ్, జీవ వైద్య అనువర్తనాల పునాదులలో కొత్త పరిశోధన దశలను అనుసరిస్తోంది. ఆయన పరశోధనకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషనర్, కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్, రాష్ట్రీయ ఉత్చతార్ శిక్ష అభియాన్ వంటి అత్యున్నత ప్రభుత్వ నిధుల సంస్థల నుంచి మద్దతు లభించింది. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ రవీంద్రనాథ్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.రమేష్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ బి.రామ చంద్ర, అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ వెంకటసుబ్బయ్య, బోధన, బోధనేతర సిబ్బంది డాక్టర్ బి.సుధాకర్‌రెడ్డిని అభినందించారు.

ఉపాధి రుణాలకు దరఖాస్తు చేసుకోండి

కడప ఎన్జీఆర్ సర్కిల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి ఉపాధి కల్పన పథకం కింద లబ్ధిపొందడానికి అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని మైనార్టీ కార్పొరేషన్ ఈడీ బ్రహ్మయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకం కింద తయారీ రంగానికి రూ.50లక్షలు, సేవా రంగానికి రూ.20లక్షల విలువతో ప్రాజెక్టు ఏర్పాటు చేస్తున్న వారికి ప్రాంతం లబ్ధిదారుల వర్గీకరణను బట్టి 15 నుంచి 35శాతం వరకు సబ్సిడీ ఇవ్వనున్నట్లు తెలిపారు. 18ఏళ్లు దాటి ఉండాలని, ఆదాయ పరమితి లేదన్నారు. అభ్యర్థులు కనీసం 8వ తరగతి పాస్ అయి ఉండాలని సూచించారు. దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా పంపాలని కోరారు.

విద్యార్థులకు అన్నదానం



విద్యార్థులకు అన్నదానం చేస్తున్న తుంగా రమణయ్య, రంజిత్‌కుమార్

కడప సెవెన్ రోడ్స్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): నటుడు రామ్‌చరణ్ పుట్టిన రోజును పురస్కరించుకొని బుధవారం కడప నగరంలోని ప్రకాష్‌నగర్‌లోని బీసీ సంక్షేమ వసతి గృహంలో పిల్లలకు చిరంజీవి యువత అధ్యక్షుడు పంద్రా రంజిత్ కుమార్, గేగుల భరత్, అబ్బన్నగారి రాజగోపాల్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి, కడప పార్లమెంట్ సమన్వయకర్త తాతంశెట్టి నాగేంద్ర, జనసేన పార్టీ నాయకులు తుంగా రమణయ్య, జీవి రమణ, జర్నలిస్టు ఫోరం అధ్యక్షుడు ఉప్పు శ్రీకాంత్, తిరుమలశెట్టి సిద్దార్థ, పోలుదాసు నాగరాజు, సాయి ఆచారి, గాజుపల్లె శేషు, అతికారి నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

జడ్పీటీసీ రవికుమార్‌రెడ్డికి మాతృవియోగం



లక్ష్మీనరసమ్మ (ఫైల్)

వేంపల్లె, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె జడ్పీటీసీ సభ్యులు మాచిరెడ్డి రవికుమార్‌రెడ్డికి మాతృవియోగం కలిగింది. ఆయన తల్లి మాచిరెడ్డి లక్ష్మీనరసమ్మ(84)బుధవారం తుదిశ్వాస విడిచారు. వయసు రీత్యా అనారోగ్యంతో ఆమె మృతిచెందారు. భౌతికకాయాన్ని స్వగ్రామం గిడ్డంగి వారిపల్లెకు తీసుకెళ్లారు. గురువారం ఉదయం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కాగా మృతదేహాన్ని కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ చంద్ర ఓబుళరెడ్డి, కేఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ సంస్థల అధినేత కందుల నాని, తదితర నాయకులు, అధికారులు, అనధికారులు నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఘనంగా తాళ్ళపాక అన్నమయ్య వర్ధంతి



నివాళి అర్పిస్తున్న నగర వాసులు

కడప కల్చరల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): పద కవితా పితామహుడు తాళ్ళపాక అన్నమాచార్యుల వర్ధంతిని పురస్కరించుకుని అన్నమాచార్యుల విగ్రహ పునర్నిర్మాణ కమిటీ సభ్యులు బండారి శివకేశవ సారధ్యంలో బుధవారం స్థానిక మునిసిపల్ హైస్కూల్ సర్కిల్ వద్ద అన్నమాచార్య విగ్రహానికి జిల్లా అర్చక పురోహిత ఐక్య వేదిక అధ్యక్షుడు విజయభట్టర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముందుగా శ్రీ రాజరాజేశ్వరీ దేవస్థానంలో గల మూలవిరాట్ అన్నమయ్య పూజా విగ్రహానికి ఆ ఆలయ ప్రధాన అర్చకుడు పిడతల గోపాలకృష్ణశర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పార్టీలకతీతంగా పలు పార్టీల నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు అన్నమచార్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సూర్యనారాయణ, వీహెచ్‌పీ నాయకులు రామ్‌మహేష్, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి బాలకృష్ణయాదవ్, జనసేన నాయకులు జీవీ రమణ, మాలే శివ, జి. రామమూర్తి, జి. వెంకటేశ్వరరావు, వెంకటేశ్వర్లు, కె.మస్తానయ్య, ఐకాన్ టీమ్ చిన్నపరెడ్డి, భారవి తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల సంఘం ఎన్నిక

సింహాద్రిపురం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పంచాయతీ కార్యదర్శుల సంఘానికి సంబంధించి బుధవారం సింహాద్రిపురం ఎంపీడీఓ కార్యాలయంలో సమావేశం నిర్వహించి కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ కమిటీలో గౌరవాధ్యక్షుడిగా జి.వెంకటరాముడు, మండల అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి, ఉపాధ్యక్షుడు కె.రాజేష్, మహిళా అధ్యక్షురాలు కె.ప్రశాంతి, కోశాధికారి అరుణ్‌కుమార్‌నాయక్, జనరల్ సెక్రటరీ రాజేష్‌కిరణ్, అదనపు సెక్రటరీ లక్ష్మీరెడ్డి, గౌరవ సలహాదారుడు ప్రతాప్‌రెడ్డి, కార్యనిర్వాహక సభ్యులుగా రాజశేఖర్, ఇంద్రకేశవరెడ్డి, హరిప్రియ, అనిల్‌కుమార్, సతీష్‌రెడ్డి, కళ్యాణ్‌కుమార్, ప్రశాంతి ఎన్నుకోబడ్డారు. ఎంపిక కాబడిన కమిటీ సభ్యుల జాబితాను ఎంపీడీఓ కృష్ణమూర్తి, ఏఓ శ్రీనివాసరెడ్డిలకు ఎన్నిక అనంతరం నూతన కమిటీ సభ్యులు అందజేశారు.

సమస్యల జాగా... జగనన్న కాలనీ

సీకేదిన్నె, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): సమస్యల వలయంలో మామిళ్లపల్లె జగనన్న కాలనీ కొట్టుమిట్టాడుతోంది. ఎంతో ఆర్భాటంగా అప్పటి ముఖ్యమంత్రి ఇళ్లను కాదు ఊర్లనే నిర్మిస్తున్నామని ప్రారంభించిన జగనన్న కాలనీలో మౌలిక వసతులు లేక ప్రజలు నిత్యం ఇబ్బందులకు గురవుతున్నారు. జగనన్న కాలనీకి వెళ్లేందుకు రోడ్డు సౌకర్యం కూడా సక్రమంగా లేక మట్టి రోడ్డులోనే వెళ్లాల్సి వస్తోంది. కనీసం ఆటోలు కూడా రాకపోవడంతో ఎక్కువ మొత్తం చెల్లించి ఆటోలను బాడుగకు తీసుకుని రావాల్సిన పరిస్థితి ఏర్పడింది. కడప నుంచి ఇందిరానగర్ వరకు రూ.20కే ఆటో వచ్చినా ఇందిరా నగర్ నుంచి జగనన్న కాలనీకి కేవలం 3 కి.మీ.లోపే ఉన్నా రూ.100 నుంచి రూ.200 వరకు చెల్లించాల్సి వస్తోందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. రాత్రిపూట వీధి లైట్లు లేకపోవడంతో మహిళలు, చిన్నపిల్లలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మరీ ముఖ్యంగా నీటి సమస్య ప్రజలను వేధిస్తోంది. ప్రజలకు నీరు అందించేందుకు బోర్లు వేసినప్పటికీ వాటిని అధికారులు ఎవరూ పట్టించుకోకపోవడంతో స్థానికులు ట్యాంకర్లను ఆశ్రయించాల్సి వస్తోంది. ట్యాంకర్ రూ.400 నుంచి రూ.500 వరకు చెల్లించి నీటిని కొని వాడాల్సిన దుస్థితి ఏర్పడింది. దీంతో కొందరు ఇళ్లు కట్టుకున్నప్పటికీ అక్కడ ఖాళీ చేసి వెళుతున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.



జగనన్న కాలనీకి వెళ్లే మట్టిరోడ్డు

● నీటి సమస్య ఎక్కువగా ఉంది



జగనన్న కాలనీలో నీటి సమస్య ఎక్కువగా ఉంది. దీంతో ట్యాంకర్ రూ.500 చెల్లించి నీటిని కొనుగోలు చేయాల్సి వస్తోంది. రోజు మార్చి రోజు నీటిని కొనలేక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు నీటిని అందించి ప్రజల కష్టాలు తీర్చాలి.

దర్బార్‌బీ, జగనన్న కాలనీ

● రోడ్డు సౌకర్యం కల్పించాలి



రోడ్డు సౌకర్యం సక్రమంగా లేక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. రోడ్డు సౌకర్యం ఏర్పాటు చేసి ఆటోలు వచ్చే విధంగా చూడాలి. సొంత వాహనాలు లేనివారు ఆటోలకు దాదాపు రూ.200 చెల్లించాల్సి వస్తోంది. రాత్రిపూట మరీ ఇబ్బందిగా ఉంది. ఆటోలు కూడా రాని పరిస్థితి ఏర్పడింది.

- రాజేశ్వరి, జగనన్న కాలనీ

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే మాధవి

కడప ఎర్రముక్కపల్లె, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కృషిచేస్తానని కడప ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ మాధవి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి తెలిపారు. బుధవారం కడప నగరం ద్వారక నగర్ ఎమ్మెల్యే నివాసంలో ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల నుంచి సమస్యలు తెలుసుకొని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సత్వరం పరిశీలించాలని సూచించారు. అలాగే మరికొన్ని సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషిచేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కడప నియోజకవర్గ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

శ్రీధర్‌శర్మకు విప్ర విభూషణ్ ఉగాది పురస్కారం

కడప కల్చరల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): సమాజ హితాన్ని కాంక్షిస్తూ చేసిన మంచి పనులను గాను ఆంధ్రప్రదేశ్ పురోహిత బ్రాహ్మణ సమాఖ్య జిల్లా ప్రధానకార్యదర్శి వారణాసి శ్రీధర్‌శర్మకు విప్ర విభూషణ్ ఉగాది పురస్కారం ప్రదానం చేశారు. ఆ మేరకు ఆంధ్రప్రదేశ్ పురోహిత బ్రాహ్మణ సమాఖ్య ఆధ్వర్యంలో బుధవారం రాజమహేంద్రవరం పవర్‌మిల్ రోడ్డులో ఉన్న రామకృష్ణారావు ట్రస్ట్ మండపంలో రాష్ట్ర స్థాయి ఆత్మీయ సదస్సు జరిగింది. ఇందులో సమాజ హితానికి సేవలందించిన ఐదుగురు పురోహితులను గుర్తించి విప్ర విభూషణ్ ఉగాది పురస్కారం అందజేశారు. కార్యక్రమంలో సమాఖ్య మార్గదర్శి యామిజాల నరసింహమూర్తి, రాష్ట్ర అధ్యక్షుడు పి. నారాయణమూర్తి, సుదర్శనం దుర్గాబాబు పుష్కర కమిటీ కన్వీనర్ టి. సునీల్‌శర్మ, కడప జిల్లా అధ్యక్షుడు మూర్తి రాజు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ రక్షణ కవచం



ర్యాలీనిర్వహిస్తున్న ట్రాఫిక్ సీఐ జావేద్

కడప క్రైం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : రహదారి ప్రమాదాల నివారణే లక్ష్యంగా కడప ట్రాఫిక్ సీఐ జావేద్, కేఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కాలేజీ ఆధ్వర్యంలో బుధవారం కడప నగరంలో ట్రాఫిక్ పోలీసు అధికారులు, సిబ్బంది హెల్మెట్ ధరించి ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించి హెల్మెట్ ఆవశ్యకత వివరించారు. ఆటోలకు ఫ్లెక్సీలు, స్టిక్కర్లు అంటించి విస్తృతంగా ప్రచారం కల్పించేందుకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ జావేద్ మాట్లాడుతూ ప్రతి ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ ధరించి ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసు అధికారులు, సిబ్బంది, కేఎస్ఆర్ఎం ఇంజనీరిగ్ కాలేజీ విద్యార్థులు పాల్గొన్నారు.

నోరు, దంత సంరక్షణపై దృష్టి పెట్టండి

సీహెచ్‌సీ వైద్యాధికారి సతీష్‌కుమార్

చెన్నూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు ప్రస్తుత పరిస్థితుల్లో నోటి క్యాన్సర్ తో బారిన పడుతున్నారని, ఇందుకు ప్రధాన కారణం నిషేధిత గుట్కా వాడడం, నోటిని పరిశుభ్రంగా ఉంచకపోవడంలాంటివి ప్రధాన కారణాలని సీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సతీష్‌కుమార్ అన్నారు. చెన్నూరు సీహెచ్‌సీలో బుధవారం వరల్డ్ ఓరల్ హెల్త్‌డేను పురస్కరించుకుని సీహెచ్‌సీలో దంత వైద్యురాలు ప్రశాంతి ఆధ్వర్యంలో దంత సంరక్షణ గురించి సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. అనంతరం ఆసుపత్రికి వచ్చిన రోగులకు టూత్‌పేస్టులు, మౌత్‌వాష్‌లు పంపిణీ చేశారు. అలాగే గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ హరీష్, డాక్టర్ శివశంకర్, హౌస్ సర్జన్‌లు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

మోతాదు మించితే చౌడుభూమిగా మారుతుంది

కమలాపురం రూరల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : ఎరువుల వాడకం మోతాదు మించి వాడితే సారవంతమైన భూమి కూడా చౌడు భూమిగా మారుతుందని ఏవో సరస్వతి అన్నారు. బుధవారం టి.చదిపిరాళ్ల, రామచంద్రాపురం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి సాయిల్ అసిస్టెంట్ లేబరేటరీ ఏడీఏ రాధాదేవి, సత్యదేవి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సన్న చిన్న కారు రైతులు నీటి కుంటలను ఏర్పాటు చేసుకునేందుకు ఉపాధి హామీ పథకం ద్వారా దరఖాస్తు చేసుకోచ్చవని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకురాలు టి.మమత, రైతులు పాల్గొన్నారు.

'పాస్టర్ ప్రవీణ్ మృతిపై దర్యాప్తు చేపట్టాలి'

కడప కల్చరల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): రాజమండ్రిలో పాస్టర్ పగడాల ప్రవీణ్ కుమార్ అనుమానాస్పద మృతిపై ప్రభుత్వం దర్యాప్తు చేపట్టాలని న్యూ నేటివ్ కృపా మినిస్ట్రీస్ అధ్యక్షుడు పాస్టర్ పి. మహేష్ కోరారు. ప్రవీణ్‌కుమార్ మృతి బాధాకరమని ఇందుకు సంతాపం తెలుపుతూ బుధవారం స్థానిక 48వ డివిజన్ లోని న్యూ నేటివ్ కృపా కాలనీలో ఉన్న చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో విశ్వాసులు రవితేజ, శాంతిరాజు, నరసయ్య, రోజా, సుగుణమ్మ, సమాధానమ్మ పాల్గొన్నారు.

టీడీపీ బలం కార్యకర్తలే : ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి

చెన్నూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : టీడీపీకి బలం కార్యకర్తలేనని అందులో ఐటీడీపీ చాంపియన్ల కృషి మరువలేనిదని ఎమ్మెల్యే కృష్ణచైతన్యరెడ్డి అన్నారు. కడప నగరం బిల్టప్ వద్ద నున్న టీడీపీ కార్యాలయంలో బుధవారం సభ్యత్వ కార్డులను ఎమ్మెల్యే కృష్ణచైతన్యరెడ్డి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కమలాపురం నియోజకవర్గంలో రికార్డు స్థాయిలో 51015 మంది సభ్యత్వం పొందారని తెలిపారు. పది పదిహేను రోజుల్లో నియోజకవర్గంలోని అన్ని పంచాయతీల్లో పర్యటిస్తానన్నారు. ఏప్రిల్‌లో నియోజకవర్గానికి కార్యకర్తలతో మాట్లాడేందుకు నారా లోకేశ్ వస్తున్నారన్నారు. పుత్తా నరసింహారెడ్డి మాట్లాడుతూ ఏప్రిల్ మొదటి వారంలో ఇప్పటివరకు జరిగిన పనులకు సంబంధించి బిల్లులు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్లు కె.విజయభాస్కర్‌రెడ్డి, గంగిరెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, క్రిష్ణారెడ్డి,భాస్కర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు శివారెడ్డి, గంధం మోహన్‌బాబు, టి. వెంకటసుబ్బారెడ్డి, ఆవుల పవన్‌కుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దీపును చంపిన వారిని కఠినంగా శిక్షించాలి



కొవ్వొత్తుల ర్యాలీలో ట్రాన్స్‌జెండర్లు

పులివెందుల టౌన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లిలో దీపును హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని పులివెందుల తాలూకా ట్రాన్స్ జెండర్స్ సమాఖ్య సభ్యులు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని పూలంగళ్ల కూడలిలో పులివెందుల తాలూకా ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీ ఆధ్వర్యంలో ట్రాన్స్‌జెండర్లు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వంకస్థలాన్ని కాపాడాలి

కడప సెవెన్ రోడ్స్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి):కడప నగర పరిధిలోని రిమ్స్ పోలీస్‌స్టేషన్ వద్ద గల నిజాంనగర్‌లో సర్వేనెంబర్ 376లో వంకపోరంబోకు ఆక్రమణకు కొంతమంది ప్రయత్నిస్తున్నారని, రాయలసీమ మహిళా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మీదేవి, తస్లీమ్ ఆరోపించారు. బుధవారం కడప తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకురాలు శోభారాణి, చంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

వేంపల్లెకు సబ్‌రిజిస్ట్రార్‌ను నియమించండి

వేంపల్లె,మార్చి 26 (ఆంధ్రజ్యోతి): వేంపల్లెకు కొత్త సబ్‌రిజిస్ట్రార్‌ను నియమించాలని దేవస్థాన మాజీ చైర్మన్ ఎద్దుల కొండ్రాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌రిజిస్ట్రార్ లేకపోవడంతో రిజిస్టర్‌లు సక్రమంగా జరగడం లేదని, తద్వారా ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతోందన్నారు. కొత్త సబ్‌రిజిస్ట్రార్ లేకపోవడంతో రిజిస్టర్లు జరగక అక్కడున్న స్టాంప్ వెండర్ల కార్యాలయాలు బోసిపోయి ఉన్నాయి. వెంటనే నియమించాలని అధికారులను కోరారు.

రోగులకు పండ్లు, బ్రెడ్డు పంపిణీ

వేంపల్లె, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె ప్రభుత్వ వైద్యశాలలో ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి జన్మదినం పురస్కరించుకొని మాజీ ఎంపీటీసీ సభ్యుడు జీవీ రమణ ఆధ్వర్యంలో బుధవారం పంపిణీ చేశారు. అంతకుముందు ఎమ్మెల్సీ కార్యాలయంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సుబ్బారెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఆర్వీ రమేష్, ఏమిరెడ్డి కృష్ణారెడ్డి, మాజీ మండల కన్వీనర్ మల్లంగి భాస్కర్‌రెడ్డి, పోతిరెడ్డి శివ, భానుకిరణ్ పాల్గొన్నారు.

ప్రతి రైతు రశీదులు పొందండి

వీరపునాయునిపల్లె, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): రబీ 2024-25 సీజన్‌కి సబంధించి పంటలు సాగుచేసి ఈ-పంట నమోదు చేయించుకున్న ప్రతి రైతు రశీదులు పొందాలని ఏవో శ్యామ్‌బాబు తెలిపారు. బుధవారం మండలంలోని తలపనూరు రైతు సేవా కేంద్రాన్ని ఆయన తనిఖీ చేసి పంట నమోదు చేసుకున్న రైతులకు రసీదులు అందించారు. అలాగే రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య కోసం నమోదుచేసుకోవాలని కోరారు.

'ఇఫ్తార్ విందు ముస్లింలపై కపటప్రేమే'

కడప కలెక్టరేట్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): రంజాన్ మాసంలో కూటమి సర్కారు ముస్లింలను ఇఫ్తార్‌కు ఆహ్వానించడం కపట ప్రేమ అని నగర కాంగ్రెస్ అధ్యక్షుడు అఫ్జల్ ఖాన్ విమర్శించారు. బుధవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఈకార్యక్రమంలో కడప నియోజక వర్గ కో ఆర్డినేటర్ బండి జకరయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు కదిరి ప్రసాద్ గౌడ్ పాల్గొన్నారు.

మూల్యాంకన సిబ్బందికి సౌకర్యాలను కల్పించాలి

కడప ఎడ్యుకేషన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): కడప మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ మెయిన్‌లో 3వ తేదీ నుంచి జరగనున్న పదో తరగతి మూల్యాంకన విధులలో పాల్గొనే సిబ్బందికి మెరుగైన వసతులు కల్పించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.శ్యామ్‌సుందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం డీఈఓ కార్యాలయలో డీఈవో షంషుద్దీన్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఖాదర్‌బాషా, శ్రీనివాసరెడ్డి, జిల్లా కార్యదర్శి రమేష్‌రెడ్డి, జిల్లా కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

పల్లెప్రగతికి పరిశుభ్రతే మూలం

చెన్నూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : పల్లెలు ప్రగతిలో పయనించాలంటే మొదట ఆ గ్రామాలు పరిశుభ్రతగా ఉండాలని ఎంపీడీవో కిరణ్‌మోహన్‌రావు అన్నారు. మండలంలోని ముండ్లపల్లె గ్రామ సచివాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన ప్రజలు, రైతులు, సచివాలయ సిబ్బంది సమావేశంలో మాట్లాడారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాసులరెడ్డి, సచివలయ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళకు తీవ్ర గాయాలు

వల్లూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : కడప - తాడిపత్రి ప్రధాన రహదారిలో మండల పరిధిలోని కుమారునిపల్లె గ్రామ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలైనట్లు స్థానికులు, పోలీసులు తెలిపారు. వారి సమాచారం మేరకు గంగాదేవి తన సొంత పనుల నిమిత్తం ద్విచక్ర వాహనంలో కుమారునిపల్లె గ్రామం నుంచి రోడ్డు దాటుతుండగా కడప వైపు వస్తున్న లారీ ఢీకొన్న సంఘటనలో ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. దీంతో అక్కడున్న వారు 108కి సమాచారం అందించగా కడప రిమ్స్‌కు తరలించారు. ఈ మేరకు పోలీసులు సంఘటనాస్థలానికి వెళ్లగా అప్పటికే ఆమెను చికిత్స కోసం 108లో తరలించినట్లు గ్రామస్థులు తెలిపారు.

టోల్‌గేటు వేలం రూ.6.45 లక్షలు

సీకేదిన్నె, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొలుములపల్లె టోల్‌గేటు వేలం రూ.6.45 లక్షలకు దాది వెంకటసుబ్బయ్య దక్కించుకున్నట్లు పంచాయతీ కార్యదర్శి నారాయణరెడ్డి తెలిపారు. స్థానిక సచివాలయంలో బుధవారం జరిగిన వేలంపాటలో మొత్తం 11 మంది పోటీ పడగా అందులో డి.వి.సుబ్బయ్య అధిక పాట పాడినందున ఆయనకు సంవత్సరంపాటు ఏప్రిల్ 1 నుంచి వచ్చే సంవత్సరం మార్చి 31 వరకు టోల్‌గేటు వసూళ్ల చేసుకునేందుకు హక్కులు కల్పించడం జరుగుతుందన్నారు. ట్రాక్టర్‌కు రూ.70, టిప్పర్‌కు రూ.100 లెక్కన టోల్ గేటు నిర్ణయించడమైందన్నారు. కార్యక్రమంలో ఈవోఆర్‌డీ డి.వి.సుబ్బారెడ్డి, డీఎల్‌పీవో విజయభాస్కర్, సర్పంచ్ సుబ్బరాయుడు పాల్గొన్నారు.

ఒకటి నుంచి సదరం స్లాట్లు

లింగాల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు పింఛన్ పొందేందుకు వైకల్యాన్ని ధృవీకరించే సదరం సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఏప్రిల్ 1వ తేదీ నుంచి వెబ్‌సైట్ ఓపెన్ అవుతుందని ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి తెలిపారు. దివ్యాంగుల పింఛన్ల తనిఖీలో భాగంగా కొంతకాలంగా వెబ్‌సైట్ ఓపెన్ కాలేదని అర్హత ఉన్న దివ్యాంగులు సదరం సర్టిఫికెట్‌ల కోసం స్లాట్లు నమోదు చేసుకోవచ్చన్నారు.

నేడు ఉపాధి హామీ ఓపెన్ ఫోరం

సింహాద్రిపురం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలో గత ఏడాది జరిగిన ఉపాధి పనులపై 18వ విడత సామాజిక తనిఖీ బహిరంగ సభ గురువారం ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కృష్ణమూర్తి, ఏపీఓ జయభారతి తెలిపారు. సమావేశానికి ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు తప్పక హాజరుకావాలని ఎంపీడీఓ కోరారు.

వీఎన్‌పల్లె మాజీ మండలాధ్యక్షుడు మృతి

వీరపునాయునిపల్లె, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అనిమెల గ్రామానికి చెందిన మాజీ మండలాధ్యక్షుడు జి.అశోక్‌రెడ్డి అనారోగ్యంతో మృతిచెందారు. ఇతను గతంలో సర్పంచ్‌గా, సింగిల్‌విండో అధ్యక్షుడిగా, ఎంపీటీసీ నుంచి ఎంపీపీగా కొనసాగారు. ఈయన అనారోగ్యంతో గత రాత్రి మృతిచెందారు. బుధవారం ఉదయం టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన వెంట మండల టీడీపీ కన్వీనర్ విజయభాస్కర్‌రెడ్డి ఉన్నారు.

ఉప్పరపల్లె మాజీ సర్పంచ్ మృతి

చెన్నూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఉప్పరపల్లెకు చెందిన మాజీ సర్పంచ్ గాజులపల్లె నాగిరెడ్డి (93)అనారోగ్యంతో కడప నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. గ్రామపంచాయతీకి 30 ఏళ్లగా సర్పంచ్‌గా పనిచేసిన ఆయన మృతి చెందడంతో పలువురు సంతాపాన్ని వ్యక్తం చేశారు. అంత్యక్రియలు గురువారం ఉదయం ఉప్పరపల్లెలో నిర్వహిస్తున్నట్లు ఆయన కుటుంబసభ్యులు తెలిపారు.

భక్తుల అభీష్టం మేరకే ఆశ్రమ అభివృద్ధి

● త్వరలో గుడినిర్మాణానికి అనుమతులు

కాశినాయన, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సహకారంతో కాశిరెడ్డి నాయన భక్తుల అభీష్టం మేరకు కాశినాయన ఆశ్రమ నిర్మాణం సంపూర్ణంగా జరిగి తీరుతుందని జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, బద్వేల్ మాజీ ఎమ్మెల్యే కే.విజయమ్మ ధీమా వ్యక్తం చేశారు. బుధవారం ఇరువురు నేతలు భారీ కాన్వాయ్‌తో జ్యోతిక్షేత్రంలో వెలసిన కాశి నాయన ఆశ్రమాన్ని సందర్శించారు. వీరిని కడప టీడీపీ ఉపాధ్యక్షుడు బంగారు గుర్విరెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు ఎం.రాజారెడ్డి, మండల టీడీపీ నాయకుడు బి.రవీంద్రారెడ్డిలు గజమాలలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కాశినాయన, లక్ష్మీనరసింహస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇటీవల ఫారెస్ట్ అధికారులు అనుమతులు లేవంటూ కూల్చివేసిన నిర్మాణాల స్థానంలో మంత్రి నారా లోకేశ్ సొంత నిధులతో చేపట్టిన పునఃనిర్మాణాలను వారు పరిశీలించారు. అనంతరం



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆది, చిత్రంలో విజయమ్మ, భూపేశ్‌రెడ్డి

వారు విలేకరులతో మాట్లాడుతూ రాయలసీమ ప్రాంతంలో కాశినాయన ఆశ్రమం ఎంతో పేరు ప్రఖ్యాతులు గాంచిందని, అలాంటి ఆశ్రమంలో కొన్ని నిర్మాణాలను అటవీ అధికారులు కూల్చడం బాధాకరమనానరు. ఏదేమైనా జ్యోతిలో చోటుచేసుకున్న సంఘటనను టీడీపీ యువనేత కే.రితీష్‌రెడ్డి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగా సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి లోకేష్‌లు స్పందించిన తీరు అమోఘమని కొనియాడారు. త్వరలోనే రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు పురంధేశ్వరి ఇతర నేతలతో కలిసి ఢిల్లీకి వెళ్లి ఆశ్రమ నిర్మాణానికి అవసరమైన అన్నిరకాల అనుమతులు తీసుకొస్తామన్నారు. ఇందులో ఎవరూ ఎలాంటి అపోహలు పెట్టుకోవాల్సిన అవసరం లేదన్నారు. ఇక్కడి భక్తులకు నెట్ సౌకర్యం, హెల్త్ సబ్ సెంటర్, అంబులెన్స్ ఏర్పాటుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. జిల్లా వాసి జగన్ మోహన్‌రెడ్డి సీఎంగా, అవినాష్‌రెడ్డి ఎంపీగా ఉండి ఆశ్రమం అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం దురదృష్టకరమన్నారు. కార్యక్రమంలో జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి, బద్వేల్ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జ రోశన్న టీడీపీ నాయకులు శ్రీనివాసులరెడ్డి, పి.రవీంద్రారెడ్డి, దుగ్గిరెడ్డి,ఎన్టీఆర్ సుధాకర్‌రెడ్డి, క్రిష్ణారెడ్డి, నరసింహారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, పోలిరెడ్డి, రోహిత్‌రెడ్డి, ఖాజావలి, హుస్సేన్, నర్సిరెడ్డి ఇతర నాయకులు కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

మున్సిపల్ స్థలాలను స్వాధీనం చేసుకుంటాం

● కమిషనర్ వెంకటరామిరెడ్డి

జమ్మలమడుగు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలో ఏయే ప్రాంతంలో ఎక్కడెక్కడ ఆక్రమణలో ఉన్న మున్సిపల్ స్థలాలను సందర్శించి వాటిపై చర్యలు తీసుకుంటామని కమిషనర్ వెంకటరామిరెడ్డి తెలిపారు. బుధవారం జమ్మలమడుగు మున్సిపల్ కార్యాలయంలో ఆయన చాంబర్‌లో ఆక్రమిత స్థలాలకు సంబంధించి చర్చలో భాగంగా ఆయన స్పందించి మాట్లాడారు. పలగాడివీధి శ్రీనారాపురం వెంకటేశ్వర స్వామి వెళ్లే దారిలో అలంకార్ థియేటర్ గతంలో ఉండేదని, ప్రస్తుతం ఫంక్షన్ హాలుగా మారి ఇతరులు కొనుగోలు చేసి ఆ స్థలంలో మళ్లీ నిర్మాణాలు చేస్తున్నారన్నారు. రాబడిన సమాచారం మేరకు ఆ స్థలం ఎప్పటి నుంచి ఎవరెవరి పేర్లపై రిజిస్ట్రేషన్ అయ్యాయో లింకు డాక్యుమెంట్లు పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. అంతేకాక ధనలక్ష్మి థియేటర్ సమీపం, పాత బస్టాండు సమీపంలోని పార్కు వీధి తదితర ప్రాంతాల్లో మున్సిపల్ స్థలాలు ఎక్కడైనా ఆక్రమణలో ఉంటే వాటిని స్వాధీనం చేసుకుంటామన్నారు. మున్సిపల్ ఆదాయానికి గండికొట్టి స్థలాలు ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సంక్షేమం అభివృద్ధే లక్ష్యం: రితేష్‌రెడ్డి

బద్వేలుటౌన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): బద్వేలు నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై బుధవారం టీడీపీ కార్యాలయంలో టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త రితేష్‌కుమార్ రెడ్డి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు టీడీపీ ప్రభుత్వం కృషిచేస్తుందని ఆయన అన్నారు. నియోజకవర్గంలో ఏ సమస్య వచ్చినా తానున్నానంటూ ప్రజలకు, కార్యకర్తలకు ఆయన భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు వెంగల్‌రెడ్డి, టీపీఎస్ రవికుమార్‌రెడ్డి, ప్రతాప్‌కుమార్, రమణ, ప్రసాద్, రంతు, నరసింహనాయుడు, ఆయా మండలాలకు సంబంధించిన నాయకులు పాల్గొన్నారు.



ప్రజల నుంచి వినతులను స్వీకరిస్తున్న రితేష్‌కుమార్‌రెడ్డి

'న్యాయం జరుగుతుందనే టీడీపీలో చేరుతున్నాం'



టీడీపీలో చేరిన గోపవరం వైసీపీ వార్డు మెంబర్లు

ప్రొద్దుటూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): టీడీపీలో తమకు న్యాయం జరుగుతుందనే పార్టీలో చేరుతున్నామని వార్డు మెంబర్లు పేర్కొన్నారు. బుధవారం స్థానిక నెహ్రూరోడ్డులోని టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ఆధ్వర్యంలో గోపవరం పంచాయతీకి చెందిన 15వ వార్డు మెంబరు మండ్ల రమాదేవి, 5వ వార్డు ఆదినారాయణరెడ్డి, 8వ వార్డు గాయత్రి, 7వవార్డు కాచన రామలక్ష్మిలతో పాటు మాజీ ఎంపీటీసీ చంద్ర ఓబులరెడ్డి, కొండయ్యలు టీడీపీ తీర్థంపుచ్చుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీలో మాజీ ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి గోపవరం పంచాయతీలో ఉపసర్పంచ్ రెండున్నర సంవత్సరం ఓసీలకు మరో రెండున్నర సంవత్సరం బీసీలకు ఇస్తామని చెప్పి మోసం చేశారని, అందుకే పార్టీ వీడి టీడీపీలో చేరామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి, బచ్చల ప్రతాప్, జీసీ పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

మావోయిస్టులపై హత్యాకాండను ఆపాలి

● తహసీల్దారు కార్యాలయం వద్ద ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన

ప్రొద్దుటూరు, మార్చి 26(ఆంధ్రజ్యోతి): మధ్యభారతంలోని చత్తీస్‌ఘడ్, బస్తర్‌లలో కేంద్రం ప్రభుత్వం లక్షలాది సైనిక బలగాలతో ఆదివాసీలు, మావోయిస్టులపై ఎన్‌కౌంటర్ల పేర సాగిస్తున్న హత్యాకాండను ఆపాలని ప్రజాసంఘాల ఐక్యవేదిక నేతలు డిమాండ్ చేశారు. బుధవారం ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆదివాసీలకు వున్న రాజ్యాంగ హక్కులను కాలరాస్తూ ఎన్‌కౌంటర్ల పేరుతో ఆదివాసీలను వారికి అండగా వుండి పోరాడుతున్న మావోయిస్టులను కేంద్ర ప్రభుత్వం అంతమొందిస్తామని చెప్పి బహిరంగా హత్యాకాండ సాగించడంపై నిరసనగా తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ ఆదివాసీలకు రాజ్యాంగం ప్రకారం, చట్ట ప్రకారం వుండాల్సిన అడవి పై హక్కును తొలగించేందుకు కార్పొరేట్ శక్తులకు అడవిలోని ఖనిజ సంపద అప్పగించేందుకు కేంద్రం వందలాది ఆదివాసీ గ్రామాలను నేలమట్టం చేస్తూ వారిని అడవుల నుంచి తరిమేస్తున్నారన్నారు. అనంతరం సీనియర్ అసిస్టెంట్ ప్రమీలకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ రామయ్య, ఏఐటీయూసీ సుబ్బరాయుడు, సీపీఎం డెవిడ్, పౌరహక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు సురేష్‌బాబు, జనవిజ్ఞాన వేదిక డాక్టర్ సురేష్, మాలమహానాడు మురళీ, బీసీ సంక్షేమ సంఘం క్రిష్ణయ్య యాదవ్, ఎస్టీయూ రషీద్, మహిళా శక్తి వడ్ల లక్ష్మీదేవి, ప్రగతిశీల కార్మిక సమాఖ్య శ్రీనివాసులరెడ్డి, నాగేంద్ర, ప్రతాప్ ఎలు, విప్లవ రచయిత సంఘం వరలక్ష్మీ, ఆర్‌వీపీ దస్తగిరి, బాష, ఇస్మాయిల్, నాస్తిక సమాజం జయచంద్ర, ఆర్‌వీఎస్ హరిత, చైతన్య మహిళా సంఘం పద్మ తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న ప్రజా సంఘాల నేతలు

ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి



అధికారులకు సూచనలు ఇస్తున్న జేసీ

ఖాజీపేట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): గురువారం జరిగే ఎన్నికను పకడ్బందీగా నిర్వహించాలని జేసీ అదితిసింగ్ అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఎన్నిక నిర్వహించే కార్యాలయాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సీఐ మోహన్, ఎండీవో ఎం.వెంకటరమణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ తోఫా పంపిణీ

ప్రొద్దుటూరుటౌన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక మహమ్మదీయ కాలనీకి చెందిన బంగారు మెరుగు పనిచేసే షేక్ షబ్బీర్ కుటుంబం రంజాన్ మాసాన్ని పురష్కరించుకుని పేదలకు తోఫా పంపిణీ చేశారు. 300 మంది పేదలకు బియ్యం, చెక్కర, సేమియా, నెయ్యి, తదితరవి పంపిణీ చేశారు. కార్యక్రమంలో షాహుల్, సమద్, దిల్‌కుష్, సుజిత్, సుబ్బయ్య, ఖాజాహుస్సేన్, జమాల్‌వలి పాల్గొన్నారు.

ఎంపీడీవో సుడిగాలి పర్యటన

ముద్దనూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి తిమ్మాపురం గ్రామ పంచాయతీలో బుధవారం ఎంపీడీవో ముకుందారెడ్డి సుడిగాలి పర్యటన చేశారు. అందులో భాగంగా గ్రామ సచివాలయాన్ని సందర్శించి సిబ్బంది హాజరు పట్టీని పరిశీలించారు. తాగునీరు, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. గ్రామంలోని వీధుల్లో పారిశుధ్య కార్మికులు నిర్వహిస్తున్న చెత్త సేకరణను పరిశీలించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బియ్యం తగ్గించారంటూ ఆవేదన

దువ్వూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండలానికి సంబంధించి 37 చౌక దుకాణాల పరిధిలో 410 క్వింటాళ్ల బియ్యం తగ్గించి ఇచ్చారని, ఇదేమి న్యాయమని మండలంలోని డీలర్లు బుధవారం ఆర్ఐ ఎదుట ఆవేదన వెలిబుచ్చారు. డీలర్ల తరుపున మండల టీడీపీ కన్వీనర్ వెంకటరమణారెడ్డి, తహసీల్దారు కార్యాలయంలో ఆర్ఐతో చర్చించారు. ప్రస్తుతం డీలర్లకు రావాల్సిన కోటా అందకపోతే ప్రజలతో ఇబ్బంది తలెత్తుతుందని తెలిపారు.

సమస్యలపై వినతి


బద్వేలు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): సీపీఎం ప్రజా చైతన్య యాత్రలో భాగంగా బుధవారం నాటికి రెండవ రోజుకు చేరుకోగా ఆ పార్టీ నాయకులు సుందరయ్య, ఐలమ్మ, జ్యోతిబసు కాలనీలలో పర్యటించారు. ఈ మేరకు పలు సమస్యలు తమ దృష్టికి వచ్చినట్లు పార్టీ పట్టణ కార్యదర్శి శ్రీను పేర్కొన్నారు. ఈ సమస్యలను నియోజకవర్గ టీడీపీ యువ నాయకుడు రితేష్‌రెడ్డికి వినతిపత్రం అందించగా, అధికారులతో చర్చించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో సీపీఎం పాల్గొన్నారు.

ఇఫ్తార్ పవిత్ర కార్యం

మైలవరం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ముస్లింలకు ఇచ్చే ఇఫ్తార్ విందు అత్యంత పవిత్ర కార్యమని జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి అన్నారు. బుధవారం సాయంత్రం మండల పరిధిలోని దొమ్మరనంద్యాల గ్రామంలో ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు.

అధికారులు న్యాయం చేయాలి

ప్రొద్దుటూరు రూరల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): పసుపు కుంకుమల కింద పుట్టింటి వారు ఇచ్చిన ఆస్తిని పంచాయతీ అధికారులు అన్యాయంగా కూల్చివేశారని, తమకు న్యాయం చేయాలని పట్టణానికి చెందిన ఎం.ఓబుళకొండయ్య, సావిత్రి దంపతులు కోరారు. బుధవారం వారి స్థలం వద్ద పంచాయతీ అధికారుల తీరుపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇదివరకే తాము ఆర్‌అండ్‌బీ డీఈ, కొత్తపల్లె పంచాయతీ అధికారులను కలిసి ఈ స్థలం తమదని, కోర్టు నోటీసులు కూడా అందించామని వాపోయారు. అయితే ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా అర్ధరాత్రి సమయంలో గదిని తొలగించడం ఏమిటని వారు ప్రశ్నించారు. రూము కోల్పోవడంతో తాము జీవనాధారం కోల్పోయామని, జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని వారు కోరారు.



స్థలం వద్ద నిరసన తెల్పుతున్న బాధితులు

భక్తిశ్రద్ధలతో నారాయణస్వామి ఆరాధన మహోత్సవాలు

బ్రహ్మంగారిమఠం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): భక్తిశ్రద్ధలతో అవధూత నారాయణ రెడ్డి యోగీంద్ర స్వాముల వారి 111వ ఆరాధన మహోత్సవాలు బుధవారం ఘనంగా చేపట్టారు. ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలతో పాటు మధ్యాహ్నం కొత్తబస్వాపురం గ్రామం నుంచి జెండా మెరవణి కార్యక్రమం, రాత్రి కోలాటం, భజన కార్యక్రమాలు నిర్వహించారు. తెల్లవారుజామున స్వామివారిని తెలుగుగంగకాలనీ, బస్వాపురం గ్రామాల్లో వైభవంగా డప్పువాయిద్యాలతో, బాణసంచాలతో గ్రామోత్సవం నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఆరాధన ఉత్సవాలకు విచ్చేసిన భక్తులకు కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. భక్తులందరూ స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

31 లోపు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

కొండాపురం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): రైతులు విశిష్ట గుర్తింపు సంఖ్య (భూఆధార్) కొరకు ఈ నెల 31 లోపు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని వ్యవసాయాధికారి ఏవీ రామాంజులరెడ్డి తెలిపారు. రిజిస్టేషన్ కొరకు రైతులు తమ భూమి పాసుబుక్, ఆధార్ కార్డు, సెల్‌ఫోన్‌తో తమ పరిధిలోని ఆర్‌బీకే సిబ్బందిని సంప్రదించాలన్నారు. ఒకవేళ రిజిస్ట్రేషన్ చేయించుకోనట్లయితే పీఎం కిసాన్ పథకం వర్తించదని ఏవో తెలిపారు.

భూసార పరీక్షలు తప్పక చేయించాలి

ముద్దనూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): రైతులు భూములకు భూసార పరీక్షలు తప్పక చేయించాలని ఏవో వెంకటకృష్ణారెడ్డి సూచించారు. మండల పరిధి ఉప్పలూరు గ్రామంలోని గ్రామ సచివాలయంలో బుధవారం రైతులకు భూసార పరీక్ష ఫలితాల పత్రాలను అందించారు. కార్యక్రమంలో వీహెచ్‌ఏ రామసుందర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు తిథి భోజనం

ఎర్రగుంట్ల, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల మెయిన్ పాఠశాలలోని విద్యార్థులకు విశ్రాంత హెచ్‌ఎం కే.వేణుగోపాల్‌రెడ్డి బుధవారం తిథి భోజనం ఏర్పాటు చేశారు. తన కుమారుడు విద్యాసాగర్‌రెడ్డి జ్ఞాపకార్థం మధ్యాహ్నం తిథి భోజనం పెట్టించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలో తిథి భోజనం ఏర్పాటు చేయడం హర్షనీయమని హెచ్‌ఎం, ఉపాధ్యాయులు మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ఈకేవైసీ తప్పనిసరి

అట్లూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 22 రేషన్‌షాపుల పరిధిలో వీఆర్వోలు, గ్రామ సహాయకులు, రేషన్ డీలర్లు కలిసికట్టుగా ప్రతిఒక్కరికీ ఈకేవైసీ చేయించాలని తహసీల్దార్ సుబ్బలక్షుమ్మ వెల్లడించారు. మార్చి 30లోగా పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రమణ, వీఆర్వోలు దొరబాబు, సుబ్బయ్య, నాని, వీఆర్వోలు, గ్రామ సహాయకులు, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

మార్కెట్ వేలం నిర్వహణ

దువ్వూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం మార్కెట్ వేలం నిర్వహించారు. దినసరి మార్కెట్‌కు, బస్టాండుకు కలిపి సంయుక్తంగా వేలం నిర్వహించగా రూ.3,11,500 కటారు రాఘవేంద్ర దక్కించుకున్నారు. పంచాయతీకి సంబంధించిన మూడు రూములకు వేలం నిర్వహించగా వీటిని వరుసగా నెలకు రూ.6,700, రూ.6,800, రూ.6,500 బాడుగ చెల్లించే విధంగా ముగ్గురు దక్కించుకున్నారు. ఈవో పీఆర్‌డీ హరికృష్ణయాదవ్, పంచాయతీ సెక్రటరి సత్యనారాయణ, సర్పంచ్ చిన్నరాయుడు ఆధ్వర్యంలో వేలం జరిగాయి.

దరఖాస్తుల ఆహ్వానం

ఖాజీపేట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): కేజీబీవీలో చదివేందుకు ఆసక్తికర విద్యార్థులు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ కె.భార్గవి అన్నారు. బుధవారం వారు మాట్లాడుతూ ఖాజీపేట కేజీబీవీలో 6వ తరగతికి 40 సీట్లు, 7వ తరగతికి 5 సీట్లు, 8వ తరగతి ఒకటి, 9వతరగతి 3, 10వ తరగతి 6, 11వ తరగతి 40, 12వ తరగతి 15 ఖాళీగా ఉన్నాయని తెలిపారు.

విధుల నుంచి తప్పుకోండి

దువ్వూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): గ్రామాల పరిధిలో కూలీలకు ఉపాధి హామీ పథకం పనులను కల్పించలేని ఫీల్డ్ అసిస్టెంట్లు విధుల నుంచి తప్పుకోవాలని ఎంపీడీవో రామకృష్ణయ్య తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం వీరితో సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఉపాధి హామీ పథకం ఈసీ ఇంద్రప్రియాంక మండలంలోని ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

'పన్ను'పై వడ్డీ మాఫీ

ఎర్రగుంట్ల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల నగర పంచాయతీలో ఆస్తిపన్ను, ఖాళీ జాగా పన్నులు, పాత బకాయిలు ప్రస్తుత పన్నులు చెల్లించే వారికి 50 శాతం వడ్డీ మాఫీ చేస్తున్నట్లు కమిషనర్ పేర్లి శేషపణి ప్రజలకు తెలియజేశారు. ఈ అవకాశం ఈ నెలాఖరు వరకు మాత్రమే ఉంటుందని ఆయన వివరించారు.

తీరిన తాగునీటి సమస్య



శేషారెడ్డిపల్లె గ్రామాన్ని సందర్శించిన ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మోహన్, సిబ్బంది

జమ్మలమడుగు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మండలంలోని శేషారెడ్డిపల్లెలో తాగునీటి సమస్యను అధికారులు తీర్చారు. బుధవారం 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో 'శేషారెడ్డిపల్లెలో తాగునీటి కష్టాలు' అనే కథనం ప్రచురితమైంది. దేవగుడిలో ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి ఈ కథనాన్ని చదివి వెంటనే స్పందించారు. ఆ గ్రామంలో ఉండే కూటమి నాయకుడు గురుశేఖర్‌రెడ్డి, అధికారులతో మాట్లాడారు. వెంటనే విద్యుత్తు అధికారులు గ్రామాన్ని సందర్శించి, అనంతరం ఆర్‌డబ్ల్యూఎస్ ఇన్‌చార్జి డీఈ మోహన్, ఏఈ సుధీర్, వారి సిబ్బంది సందర్శించి సమస్యను పరిష్కరించారు. మూడు రోజులుగా తాగునీటికి ఇబ్బందులు పడ్డ గ్రామస్థులు సమస్య తీరడంతో ఆంధ్రజ్యోతికి కృతజ్ఞతలు తెలిపారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా దేవగుడి ఎన్నిక



దేవగుడి నారాయణరెడ్డి

జమ్మలమడుగు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు బార్ కౌన్సిల్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి ఎన్నికయ్యారు. బుధవారం సాయంత్రం జమ్మలమడుగు కోర్టు ఆవరణంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 2025-26 సంవత్సరానికి బార్ కౌన్సిల్ వారు ఇచ్చిన సూచనల మేరకు అసోసియేషన్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఇందులో మెజార్టీ సభ్యులు న్యాయవాదులు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా దేవగుడి నారాయణరెడ్డిని ఎన్నుకున్నారు. అలాగే సెక్రటరీలుగా కేవీ మురళీధర్‌రెడ్డి, కె.రామ్మోహన్, ఉపాధ్యక్షుడిగా జేఎల్ మహేశ్వరి, ట్రెజరర్ జ్యోతిరాణి, సీనియర్ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా ఎత్తపు భాస్కర్‌రెడ్డి, జూనియర్ మెంబర్‌గా మోహన్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఆవుల నాగార్జునరెడ్డి, గేమ్స్ అండ్ స్పోర్ట్స్ సెక్రటరీగా అక్షయ కుమార్‌రెడ్డి, మహిళా ప్రతినిధిగా జీవన స్రవంతి ఎన్నికైనట్లు వారు తెలిపారు.

పక్కాగా ఉపాధి పనులు చేయాలి

పోరుమామిళ్ల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పనులు పక్కాగా చేసేలా సిబ్బంది నిరంతర పర్యవేక్షించాలని ఎంపీడీవో రమణారెడ్డి అన్నారు. బుధవారం ఆయన మండలంలోని చల్లగిరిగెల పంచాయతీలో ఉపాధి పనులు పరిశీలించారు. అనంతరం స్థానిక స్త్రీశక్తి భవనంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పంచాయతీల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలతో ఉండాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు రాజీవ్‌రెడ్డి, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన సదస్సు

బ్రహ్మంగారిమఠం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): 'అడవులకు నిప్పు మానవాళికి ముప్పు ఎర్రచందనం పరిరక్షణపై' పాఠశాల విద్యార్థులకు కళాజాత బృందంచే అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని మల్లేపల్లె జడ్పీ పాఠశాలలో పోరుమామిళ్ల అటవీశాఖ రేంజ్ అధికారి రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సెక్షన్ అధికారి బీవీ రమణ, బీట్ ఆఫీసరు నారాయణస్వామి, క్రిష్ణయ్య, కరుణాకర్, భారతి, వీరప్రతాప్, బేస్‌క్యాంపు మొబైల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

తల్లీబిడ్డల సంరక్షణే ధ్యేయం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారి శశిభూషన్‌రెడ్డి

ప్రొద్దుటూరు రూరల్, మార్చి 26 (ఆంధ్ర జ్యోతి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రోగులకు మెరుగైన సేవలు అందిస్తూ తల్లిబిడ్డల సంరక్షణే ధ్యేయంగా పనిచేయాలని జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారి డాక్టర్ శశిభూషన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం కల్లూరు పీహెచ్‌సీని ఆయన తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా రోగులకు అందుతున్న సేవలను, ఆస్పత్రిలోని రికార్డులను పరిశీలించారు. గర్భవతుల, బాలింతల ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీశారు. తల్లీబిడ్డల మరణాలను తగ్గించాలని గణాంకాల అధికారి డాక్టర్ రమేష్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను తెలపండి: ఎమ్మెల్యే

మైలవరం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): దాల్మియా పరిశ్రమ రెండవ ప్లాంట్‌కోసం గురువారం ఏర్పాటు చేస్తున్న ప్రజాభిప్రాయ సేకరణ సదస్సులో స్థానికులు పాల్గొని వారి సమస్యలు సామరస్యంగా అధికారులకు తెలియజేయవచ్చునని ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి పేర్కొన్నారు. బుధవారం రాత్రి మండల పరిధిలోని నవాబుపేట, దుగ్గనపల్లె గ్రామాల్లో జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీతో కలిసి పర్యటించారు. ఈ కార్యక్రమంలో జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్ రెడ్డి, తహసీల్దారు లక్ష్మీనారాయణ, ఎంపీడీవో రామచంద్రారెడ్డి, మండల అధికారులు, డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ గోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు వితరణ

కాశినాయన, మార్చి 26(ఆంధ్రజ్యోతి): షేర్‌ది విజన్ ఆధ్వర్యంలో నిరాశ్రయులకు ఆశ్రయం ఇస్తున్న ఆశ్రమాలకు నిత్యావసర సరుకులు, దుస్తులు అందజేయడం గొప్ప విషయమని ఎస్ఐ హనుమంతు పేర్కొన్నారు. మండలంలోని ఓబుళాపురం సమీపంలోని వివేకానంద సేవాశ్రమానికి బుధవారం ఖమ్మంకు చెందిన షేర్‌ది విజన్ ఆధ్వర్యంలో సంస్థ చైర్మన్ నారాయణ రూ.లక్ష విలువైన నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా అన్నమయ్య వర్ధంతి

ప్రొద్దుటూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): సంకీర్తనాచార్యులు పదకవితా పితామహుడు అన్నమయ్య అని అన్నమయ్య కళాపీఠం గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక అగస్త్యేశ్వర ఆలయంలో అన్నమయ్య వర్ధంతిని కళాపీఠం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అన్నమయ్య సంకీర్తనలు శతాబ్దాలు గడిచినా ప్రజల గుండెల్లో నిలిచిపోయాయన్నారు. కార్యక్రమంలో టీడీడీ బోర్డు మాజీ సభ్యుడు చిప్పగిరి ప్రసాద్, ప్రముఖ భాగవతార్ రమణయ్య, అగస్త్యేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ రఘురామిరెడ్డి, రాష్ట్ర భాషోపాధ్యాయ సంఘం అధ్యక్షుడు అంకాల్ కొండయ్య, ఉపాధ్యక్షుడు సాయికుమార్, డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.